TELANGANA MUCHATLU

# తెలంగాణ ముచ్చట్లు

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-20- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 359 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## భారత్ వ్యూహాత్మక ఆర్థిక దెబ్బలు

- కేంద్రం బంగ్లాదేశ్ నుంచి వస్త్రాల భూమార్గ దిగుమతులపై ఆంక్షలు విధింపు
- దేశీయ వస్త్ర పరిశ్రమకు రూ.1000 కోట్లకు పైగా కొత్త అవకాశాలు
- ఆంక్షల కారణంగా దేశీయ, అంతర్జాతీయ బ్రాండ్ల సరఫరాలో ఒత్తిడి
- దిగుమతి సుంకం లేకపోవడంతో బంగ్లాదేశ్ వస్త్రాలు పెరుగుతున్నాయి
- చైనా వస్తువులు బంగ్లాదేశ్ మార్గం ద్వారా భారత మార్కెట్‌లో ప్రవేశం
- బంగ్లాదేశ్ భారత్ నుంచి నూలుపై పరిమితులు విధించడంతో ఉద్రిక్తత
- దేశీయ రెడీమేడ్ గార్మెంట్లకు ఈ నిర్ణయం మేలుగా ఉంటుందని పరిశ్రమ అభిప్రాయం

2లో..



## వరంగల్ రైల్వే స్టేషన్‌కు నయా లుక్

- మెరుగైన సౌకర్యాలతో వరంగల్ స్టేషన్ 90% పూర్తి
- తెలంగాణలో రైల్వే స్టేషన్లకు ప్రత్యేక అభివృద్ధి చర్యలు
- అమృత్ భారత్ పథకం కింద 40 స్టేషన్ల ఆధునీకరణ
- ఉచిత వైఫై, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు వంటి ఆధునిక వసతులు

8లో..




## అగ్నిప్రమాదానికి బాధ్యత ఎవరిది ?

- గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఏసీ కంప్రెషర్ పేలుడు అగ్నిప్రమాదానికి కారణం
- మంటలు ఎలక్ట్రికల్ మీటర్లకు వ్యాపించడంతో మంటలు పెరిగిన స్థాయి
- దట్టమైన పొగ ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లలోకి వ్యాపించడంతో కుటుంబాలు బలవడం
- మెట్ల మార్గంలో మంటలు ఎగసిపడటంతో బయటపడలేకపోయిన బాధితులు
- ఫైర్ సిబ్బంది చేరేసరికి బాధితులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు
- హెచ్‌ఆర్సీ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణకు ఆదేశాలు
- భవన భద్రతా నియమాలు పాటించకపోవడమే ప్రమాదానికి మూలకారణం
- జూన్ 30లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వ అధికారులకు హెచ్చరిక
- అగ్నిమాపక శాఖ, పోలీస్, విద్యుత్ శాఖలకు హెచ్‌ఆర్సీ నోటీసులు



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

పాతబస్తీలోని గుల్జార్‌హౌస్‌లో మే 18వ తేదీ తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 17మంది మృతిచెందగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి గల కారణాలను అధికారులు గుర్తించారు. ఈ అగ్నిప్రమాదానికి ఏసీ కంప్రెషర్ పేలుడే కారణమని ఫైర్ అధికారులు తేల్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఏసీలోని కంప్రెషర్లు పేలిపోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. కొన్ని రోజులుగా నిరంతరాయంగా ఏసీలను నడుపుతుండటంతో ఈ ఘటన చోటుచేసుకుందని అన్నారు.

మిగతా 2లో..



## కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు వర్గాలకు వెన్నుదన్ను

### నల్లమలలో పుట్టిన తాను సీఎం కావడం గర్వకారణం: రేవంత్ రెడ్డి

- అచ్చంపేట నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ ఉందని ప్రకటించార
- వెనుకబడిన వర్గాలకు భూమి, భుక్తి దక్కించడంలో కాంగ్రెస్ పాత్ర కీలకం
- గిరిజనుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులకు దోహదపడతాం
- నల్లమల డిక్లరేషన్‌ను నాలుగేళ్లలో పూర్తి చేస్తామని భట్టి విక్రమార్క హామీ
- గిరిజన యువత కోసం రూ.1,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం
- యంగ్ ఇండియా పాఠశాలలతో సమగ్ర విద్యా వ్యవస్థను రూపొందించనున్నాం
- నల్లమలలో పుట్టి, ప్రజల కోసం పనిచేస్తున్న సీఎం అని సీతక్క ప్రశంస
- ఆదిమ జాతుల అభివృద్ధికి ప్రత్యేక చట్టాలు అవసరమని అభిప్రాయం
- గత పాలకుల కారణంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని జూపల్లి విమర్శ
- పోడు భూముల్లో సోలార్ మోటార్ల ఏర్పాటు ద్వారా రైతులకు మద్దతు



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

'నల్లమల బిడ్డగా ఈ ప్రాంతానికి రాగానే నా గుండె ఉద్వేగానికి లోనవుతోంది. జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాప్‌రెడ్డి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి, మాజీ మంత్రి మహేంద్రనాథ్ వంటి మహోన్నతమైన వారు ప్రాతినిధ్యం వహించారు. నల్లమల బిడ్డగా నేను సీఎం కావడం గర్వంగా భావిస్తున్నా'నని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని సీఎం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి నల్లమలతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు వెన్నుదన్నుగా నిలిచిన చరిత్ర ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు భూమి, భుక్తి దక్కిందంటే కాంగ్రెస్ వల్లనే సాధ్యమైందని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంపై తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని అన్నారు.

మిగతా 2లో..

## గాజా మొత్తం నియంత్రణలోకి తీసుకుంటాం

- వైమానిక దాడుల్లో 100కు పైగా మృతులు ఇజ్రాయెల్ ధాటికి గాజా విలవిల
- ఖాన్ యూనిస్, జబాలియా లక్ష్యంగా ఇజ్రాయెల్ మిలిటరీ దాడులు
- హమాస్ తో చర్చల్లో తీవ్రత – పాలన నుంచి వైదొలగాలని ఇజ్రాయెల్ డిమాండ్
- ట్రంప్ ప్రకటన కలకలం.. గాజాను అమెరికా స్వాధీనం చేసుకోవాలని సూచన
- ఇజ్రాయెల్ లక్ష్యం – హమాస్ ఉన్మూలన, పూర్తి భూభాగాధిపత్యం
- గాజా ప్రజలకు ఖాళీ ఆదేశాలు .. పోరాట ప్రాంతాలుగా గుర్తింపు
- శరణార్థులపై దాడులు – మానవతా సంక్షోభం తీవ్రమవుతోంది
- అమెరికా అధ్యక్షుడి ప్రకటనల ప్రభావం .. గాజా భవిష్యత్తుపై చర్చలు

### నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ ముచ్చట్లు

గాజా మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. ఇజ్రాయెల్ హమాస్ ల మధ్య ఉద్రిక్తతల వేళ గాజాలో మరోసారి దాడుల తీవ్రతను పెంచిన నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

మిగతా 2లో..

## సమస్యలు చెప్పుకోవడానికి వస్తే అరెస్టు చేస్తారా..

- సీఎంను కలవాలని ప్రయత్నించిన చెంచులకు అరెస్ట్
- ప్రజాస్వామ్యంపై బీఆర్‌ఎస్ నేత హరీశ్ రావు ప్రశ్నలు
- చెంచు సంక్షేమంపై ప్రభుత్వం తీరును ఖండించిన హరీశ్

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేసిన చెంచు సోదరులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు.

మిగతా 2లో..



## కాళేశ్వరం కమిషన్ గడువు పొడిగింపు

- మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిన సంఘటన
- ఏపీ రిటైర్డ్ జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో విచారణ
- తుది నివేదిక ఆలస్యం మరియు ఉత్కంఠ
- ప్రజాప్రతినిధుల విచారణలో భాగస్వామ్యం

2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు వర్గాలకు వెన్నుదన్ను





(మొదటి పేజీ తరువాయి)

చెంచులు, గిరిజనుల జీవితాలలో విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు నియోజకవర్గాన్ని దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకుంటున్నానని అన్నారు. మళ్లీ వచ్చే ఏడాది మే 19న మాచారానికి వస్తానని, అప్పటి వరకు వెనుకబడిన వర్గాలు కూడా ఆర్థికంగా బలపడేలా చేయూత అందించాలని అధికార యంత్రాంగానికి చెప్పారు. నల్లమలలోని అన్ని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, నివేదికను రూపొందించాలని అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతులకు సోలార్ పంపుసెట్లు అందించాలని చెప్పారు. 100 రోజుల్లో ప్రణాళికను పూర్తి చేయాలని, 100 శాతం సబ్సిడీపై నిధులు మంజూరు చేసే బాధ్యతను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు అప్పగించారు. ఐటీడీఏకు ఐఏఎస్ అధికారిని నియమించే విషయమై మంత్రి సీతక్క క్లారిటీ ఇచ్చారు.

**నల్లమల డిక్లరేషన్‌ను పాటిస్తాం : భట్టి విక్రమార్క**

నల్లమల డిక్లరేషన్‌ను తూచ తప్పకుండా నాలుగేళ్లలో పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. గిరిజన యువతకు జూన్ 2న రూ.1,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించిన ఈ రోజు భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన సుదినమన్నారు. వజ్రంలాంటి ముఖ్యమంత్రి, వజ్రాల్లాంటి మంత్రుల హృదయ అంతరాల్లో నుంచి ఈ పథకం ఉద్భవించిందన్నారు. ఈ రోజు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెచ్చిన నల్లమల డిక్లరేషన్‌తో రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి వంటి నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందవద్దని, ప్రజలకు పథకాలు అందవద్దని ప్రతిపక్షాలు ఏదో ఒక కట్ర చేస్తున్నాయన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఉమ్మడి కుంటుబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించబోతున్నామన్నారు. ప్రతీ పాఠశాలను 25 ఎకరాలలో రూ.200 కోట్లతో నిర్మించనున్నామమన్నారు. అందుకోసం మొదటి దశలోనే 104 పాఠశాలలకు రూ.11,600 కోట్లు మంజూరు చేశామన్నారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం పెంచామన్నారు.

**నల్లమలలో ఎదిగి.. ఒదిగి సీఎం అయ్యారు : మంత్రి సీతక్క**

నల్లమల ప్రాంతంలో పుట్టి, ఎదిగిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి, ప్రజల కోసం ఒదిగి పాలన అందిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. ఆదిమ జాతులకు ప్రత్యేక చట్టాలను చేయడం జరిగిందన్నారు. భూ సంరక్షణ చట్టాలు ఎన్ని ఉన్నా గత ప్రభుత్వంలో ఆదిమ జాతి ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. నల్లమలలో పుట్టిన రేవంత్ రెడ్డికి ఈ ప్రాంత సమస్యలు తెలుసు కాబట్టి, వారి అభివృద్ధి కోసం ఎంత ఖర్చయినా ఈ ప్రభుత్వం భరిస్తుందన్నారు. గతంలో ఐటీడీఏలో ఎన్నో శాఖలు ఉన్నా.. ప్రస్తుతం 3, 4 శాఖలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. 15 సంవత్సరాలు నిండిన చెంచు యువతులు మహిళా సంఘాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో వడ్డీ వ్యాపారుల దోపిడీ అధికంగా ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో 60 లక్షల మహిళా సంఘాలు ఉన్నాయని మంత్రి చెప్పారు.

**రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారు: మంత్రి జూపల్లి కృష్ణారావు**

గత పాలకులు రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల్లోకి నెడితే తాము అవి తీర్చుకుంటూ, 16 మాసాల ఎన్నో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ప్రజా సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలీసుల చేతకొట్టించిన భూమిలోనే సోలార్ మోటార్లు పెట్టించాం: ఎంపీ మల్లు రవి గత ప్రభుత్వ పాలనలో పోడు భూములను సాగు చేసిన రైతులను చెట్టుకు కట్టేసి కొట్టించారని, ఆ భూములోనే ప్రజా పాలన ప్రభుత్వం సోలార్ మోటార్లు పెట్టిందన్నారు. మీ కోసం పనిచేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే అది ఒర్వలేక ఏదో ఒకటి రాద్ధాతం సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ సూచించారు.

**వారిని కాపాడుకునేదే కాంగ్రెస్ ప్రభుత్వం: మంత్రి దామోదర రాజనరసింహ**

రాష్ట్రంలో ఉన్న దళితులను, ఆదిమ జాతులను కాపాడుకునేదే కాంగ్రెస్ ప్రభుత్వమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. వారి హక్కులను రక్షించేది కూడా కాంగ్రెస్సేనన్నారు. ఇందిరమ్మ పాలనలో 25 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిందన్నారు. గత ప్రభుత్వం ధరణి తెచ్చి, పేదవాడి భూములను కొల్లగొట్టిందన్నారు. 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు సూచనల మేరకు తమ ప్రభుత్వమే మొదటి సారిగా అమలు చేసిందన్నారు.

**పర్యాటక అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ**

దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో సాగునీరు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అప్పార్ ప్లాట్ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సభలో ఆయన సీఎంకు విన్నవించారు. మద్దిమడుగు వద్ద వంతెన నిర్మాణంతో పాటు నల్లమల్లలో పర్యాటక అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. మన్ననూర్ ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను, పూర్తి స్థాయిలో కార్యాలయ సిబ్బందిని నియమించాలన్నారు. నియోజకవర్గంలో పేదప్రజలు అధికంగా ఉన్నందున మరో 100 ఇందిరమ్మ ఇళ్లు అదనంగా మంజూరు చేయాలని, అమ్రాబాద్ మండలంలో 220/33 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, బీకే తిర్మాలాపూర్, బీకే లక్ష్మాపూర్ గ్రామాలలో రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఆర్ఎఫ్ఓఆర్ ద్వారా పట్టాలు ఇప్పించాలని కోరారు. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# భారత్ వ్యూహాత్మక ఆర్థిక దెబ్బలు

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)





భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న పొరుగుదేశాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా, ఆర్థిక పరంగా గట్టిగా బుద్ధి చెబుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలు.. నిత్యం భారత్ అంటే అక్కసు వెళ్లగక్కుతున్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా ఈ 3 దేశాలు పరస్పరం సహకారం అందించుకుంటున్నాయి. షేక్ హసీనా ప్రధానిగా ఉన్నంతవరకు భారత్‌కు మిత్రదేశంగా ఉన్న బంగ్లాదేశ్.. ఆమె గద్దె దిగిపోవడంతో ఒక్కసారిగా శత్రుదేశంగా మారిపోయింది. ఇక చైనా, పాకిస్తాన్ అయితే గత కొన్ని దశాబ్దాలుగా భారత్‌తో వైరం పెట్టుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ 3 దేశాలకు బుద్ధి చెప్పేందుకు భారత్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్, చైనా, పాకిస్తాన్ దేశాలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.

భూమార్గం ద్వారా బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే వస్త్రాలను ఆంక్షలు విధించే నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవడంతో దేశీయ వస్త్ర పరిశ్రమకు రూ.వెయ్యి 1000 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల మేర కొత్త అవకాశాలను తెచ్చిపెట్టే అవకాశం ఉందని భారత్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ నిర్ణయం కారణంగా దేశీయ, ఇంటర్నేషనల్ బ్రాండ్ దుస్తుల సప్లై చైన్ దెబ్బతినే అవకాశాలు ఉన్నాయనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. దీనివల్ల చలికాలంలో టీషర్ట్‌లు, డెనిమ్స్ దుస్తుల ధరలు 23 శాతం పెరిగే అవకాశం ఉందని సమాచారం.

దీనికి సంబంధించి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శనివారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. బంగ్లాదేశ్ నుంచి భూ సరిహద్దుల ద్వారా దుస్తులు, ఇతర ఉత్పత్తుల దిగుమతులను భారత్ నిషేధించింది. అయితే కోల్‌కతా, నవ షేవా పోర్టుల ద్వారా సరుకు రవాణాకు అనుమతి ఉంది. భారత్‌లోకి వచ్చే వస్తువులపై దిగుమతి సుంకం లేని కారణంగా బంగ్లాదేశ్ నుంచి పన్ను లేకుండానే దిగుమతి అయ్యే వస్త్రాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా దేశీయంగా టెక్స్‌టైల్స్ పరిశ్రమను ప్రోత్సహించి.. విదేశీ దుస్తులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో చైనా నుంచి రహస్యంగా బంగ్లాదేశ్ మీదుగా భారత్‌లోకి మళ్లించబడుతున్న వస్తువులను కూడా అరికట్టవచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే చైనా నుంచి భారత్‌లోకి నేరుగా రవాణా చేస్తే ప్రస్తుతం 20 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నారు. భారత్ నుంచి ఎగుమతి అయ్యే నూలుపై ఏప్రిల్ నెలలోనే బంగ్లాదేశ్ పరిమితులు విధించిందని.. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) ఛైర్మన్ రాకేష్ మెహ్రా తెలిపారు. ఇది సాంప్రదాయకంగా భారత్ మొత్తం నూలు ఎగుమతిలో దాదాపు 45 శాతం ఉంటుంది. బంగ్లాదేశ్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయానికి వ్యూహాత్మకంగా భారత్ తీసుకున్న బలమైన ప్రతిస్పందనగా కనిపిస్తోందని రాకేష్ మెహ్రా వెల్లడించారు. ఈ నిర్ణయం బంగ్లాదేశ్ దుస్తుల దిగుమతి వ్యయాన్ని పెంచుతుందని.. దీని వల్ల దేశీయ రెడీమేడ్ గార్మెంట్ ఉత్పత్తిదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. భారత్ నుంచి నూలు ఎగుమతి చేసేవారు తమ సరఫరాను దేశీయ మార్కెట్‌కు మళ్లించడానికి వీలు కలుగుతుందని.. తద్వారా డిమాండ్ గ్యాప్‌ను పూరించవచ్చని పేర్కొన్నారు. క్లాతింగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఏఐ) అధ్యక్షుడు సంతోష్ కటారియా.. తక్కువ ధర కలిగిన బట్టలు భారతీయ రిటైల్ మార్కెట్‌లోకి అడ్డగోలుగా ప్రవేశిస్తున్నాయనే పరిశ్రమ దీర్ఘకాలిక ఆందోళనను ఈ చర్య పరిష్కరిస్తుందని.. ఇది దేశీయ తయారీదారులపై ముఖ్యంగా ఎంఎస్ఎంఈలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

# అగ్నిప్రమాదానికి బాధ్యత ఎవరిది ?

(మొదటి పేజీ తరువాయి)



కంప్రెషర్ పేలి పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ మీటర్లకు మంటలు వ్యాపించాయని గుర్తించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న పలు ఏసీల్లో ప్రమాదం జరగడంతో భారీగా పొగ అలుముకుందని చెప్పారు.

ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లలోకి దట్టంగా పొగ వ్యాపించిందని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లేందుకు యత్నించారు. టెర్రస్ నుంచి బయటకు రాలేక కుటుంబసభ్యులు మళ్లీ కిందకు వచ్చారు. మెట్ల మార్గంలో మంటలు భారీగా ఎగసిపడటంతో లోపలే కుటుంబ సభ్యులు ఉండిపోయారు. ఫైర్ సిబ్బంది వచ్చే సరికే అపస్మారక స్థితిలోకి కుటుంబసభ్యులు వెళ్లిపోయారు.

**గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంపై హెచ్ఆర్సీ సీరియస్**

గుల్జార్ హౌస్ వద్ద జరిగిన భారీ అగ్నిప్రమాదంపై హెచ్ఆర్సీ సీరియస్ అయింది. ఈ ప్రమాద ఘటనపై సుమోటోగా కేసు విచారణకు హెచ్ఆర్సీ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశించారు. భవన భద్రత, విద్యుత్ నిర్వహణ, అగ్నిప్రమాద నివారణ పరమైన నిబంధనలు పాటించలేదని మీడియాలో వచ్చిన కథనాలపై హెచ్ఆర్సీ కమిషన్ స్పందించింది. ఈ ఘటనలో 17 మంది దుర్మరణం చెందడానికి గల కారణాలపై జూన్ 30వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి , హైదరాబాద్ పోలీస్ కమిషనర్ , అగ్నిమాపక శాఖ డీజీ , టీఎస్ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్లకు హెచ్ఆర్సీ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.



# కాళేశ్వరం కమిషన్ గడువు పొడిగింపు

- మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిన సంఘటన
- ఏపీ రిటైర్డ్ జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో విచారణ
- తుది నివేదిక ఆలస్యం మరియు ఉత్కంఠ
- ప్రజాప్రతినిధుల విచారణలో భాగస్వామ్యం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ సర్కార్ మరోసారి కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును పొడిగించింది. ఈనెల 31వ తేదీతో కమిసన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో దానిని జూలై 31వ తేదీ వరకూ పొడిగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల బ్యారేజీల్లో అవకతవకలపై ఉమ్మడి ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించింది. తొలుత ఈనెల (మే నెల)లోనే తుది రిపోర్ట్ ఇస్తామని కమిషన్ లీక్ ఇచ్చినప్పటికీ.. జూలై 31వ తేదీ వరకూ పొడిగించడంతో విచారణపై ఉత్కంఠ నెలకొంది. ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తారనే చర్చ నడుస్తోంది.

# గాజా మొత్తం నియంత్రణలోకి తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)




దౌత్య కారణాలకు లోబడి గాజాలో క్షామాన్ని నివారించాల్సి అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. ‘‘మా పోరాటం తీవ్రస్థాయిలో ఉంది. మేం పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదేలేదు. విజయం సాధించాలంటే.. మనల్ని అడ్డుకోలేరనే విధంగా వ్యవహరించాలి’’ అని టెలిగ్రామ్ వేదికగా నెతన్యాహు ఒక వీడియోను పోస్టు చేశారు.

మరోసారి ఇజ్రాయెల్ గాజాపై దాడుల తీవ్రతను పెంచింది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరిపింది. ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది.. మొత్తంగా 103 మంది మరణించారని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు ఇటీవల నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే.

పాక్ ప్రజల దైన్యం.. ఆ దేశ సైన్యం!

తాజాగా గాజాలోని రెండో అతి పెద్ద నగరమైన ఖాన్ యూనిస్, సమీప ప్రాంతాలను ఖాళీ చేయాలని స్థానిక ప్రజలకు ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. వాటిని ప్రమాదకరమైన పోరాట ప్రాంతాలుగా పరిగణిస్తునట్లు పేర్కొంది. మరోవైపు దోహాలో జరుగుతున్న చర్చల్లో హమాస్ బహిష్కరణ అంశాన్ని ఇజ్రాయెల్ తెరపైకి తీసుకొచ్చిందని తెలుస్తోంది. యుద్ధం శాశ్వతంగా ఆగాలంటే గాజా పాలన నుంచి హమాస్ వైదొలగాలని, ఆయుధాలు అప్పగించాలని, ఆ సంస్థ ఉగ్రవాదులంతా ఇతర దేశాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తోంది. అయితే గాజా నుంచి వెళ్లడానికి, ఆయుధాల అప్పగింతకు తాము సిద్ధంగా లేమని హమాస్ చెప్పినట్లు తెలుస్తోంది.

ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గాజా గురించి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. గాజాలోని పాలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్.. దానిని అమెరికా నియంత్రణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ‘‘గాజా ఫొటోలను చూశాను. అక్కడ ఒక్క భవనమూ లేదు. అన్నీ కుప్పకూలాయి. ఆ శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. గాజాను అమెరికా తీసుకోవాలని అనుకుంటున్నాను. స్వేచ్ఛా మండలంగా దాన్ని మలచాలి. గాజాకు సంబంధించి నాకు మంచి ఆలోచనలు ఉన్నాయి’’ అని పేర్కొన్నారు.

# సమస్యలు చెప్పుకోవడానికి వస్తే అరెస్టు చేస్తారా..

(మొదటి పేజీ తరువాయి)

ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా మీ సోకాల్డ్ ప్రజాపాలన అని నిలదీశారు.

నల్లమల అడవుల నుంచి వచ్చానని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. అడవి బిడ్డల సంక్షేమం పట్ల మీకు ఉన్న ప్రేమ ఇదేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తమ సంక్షేమం కోసం ఐటీడీఏ పీవోగా ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడం తప్పా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదనే విషయాన్ని మీకు తెలపాలని రావడమే వారు చేసిన తప్పా అని అడిగారు. తమ ఆరాధ్య దైవాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బాగు కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేయడం వారి తప్పా అని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులు మల్లికార్జున్, పద్మ గురువయ్యతోపాటు అమ్రాబాద్ పోలీసు స్టేషన్ లో నిర్బంధించిన చెంచులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# గిరిజనుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు సేవాలాల్ సేన వినతి

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

గిరిజనులు ఎదుర్కొంటున్న నిత్యజీవిత సమస్యలు, అభివృద్ధి లోపాలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సేవాలాల్ సేన ప్రతినిధులు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు కునుసోతు మురళి నాయక్ నేతృత్వం వహించారు.

వినతిపత్రంలో ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా మారుస్తూ చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గిరిజనులకు కేటాయించాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక తండా అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీకి సంవత్సరానికి కనీసం రూ.1 కోటి నిధులు కేటాయించాలని, నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మురళి నాయక్ మాట్లాడుతూ, "గిరిజనులు అనేక సమస్యలతో అల్లాడుతున్నారు. అభివృద్ధి ప్రయోజనాలు అందని స్థితిలో ఉన్న తండాలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సేవాలాల్ సేన ఈ దిశగా పోరాటాన్ని కొనసాగిస్తుంది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా రామకృష్ణ నాయక్, విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ నాయక్, వరంగల్ జిల్లా కన్వీనర్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. గిరిజనుల హక్కుల కోసం చేపట్టిన ఈ కార్యాచరణను స్థానికంగా విశేషంగా అభినందిస్తున్నారు.



# సమ్మర్ క్యాంపులు విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు తోడ్పడతాయి

**జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంపులు వల్ల విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు తోడ్పడతాయని జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని అన్నారు. సోమవారం పెద్ద మందడి మండలం మద్ది గట్ల, మోజర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ..సమ్మర్ క్యాంపు ల వలన చదువుతోపాటు వివిధ రకాల విద్యార్థులకు నైపుణ్యలను పెంపొందించాలని ఉద్దేశంతో 15 రోజులపాటు విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరాలలో విద్యార్థులు వివిధ రకాల ఆటలు, క్రీడలు, కలలు ఇతర నైపుణ్యాలను నేర్చుకున్నారని అన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు ముగియడంతో విద్యార్థులు సమ్మర్ క్యాంపు లను చాలా చక్కగా సద్వినియోగం చేసుకున్నారని చిన్నారులను అభినందించారు.గత 15 రోజుల నుండి పాఠశాలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పలు ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. యోగా మరియు మెడిటేషన్ ఇందులో భాగంగా విద్యార్థులు ఆసనాలు మరియు ధ్యానంకు సంబంధించిన పలు అంశాలను ప్రదర్శించడం జరిగింది. గ్లాస్ పెయింటింగ్ లో భాగంగా గ్లాస్ పై బొమ్మలు వేయడం జరిగింది. ఇందులో అమర జవాన్ మురళి నాయక్,పుష్పాలు,ఏనుగు,తెలంగాణ తల్లి,వనపర్తి జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని చిత్రపటం మరియు గాజు సీసాల పై వివిధ రకాల చిత్రాలు వేయడం జరిగింది.డ్రాయింగ్ కు సంబంధించి మన జవాన్లు పాకిస్థాన్ పై ప్రదర్శించిన ధైర్య సాహసాలు, రైతులు వేసే పంటలు, మహాత్మా గాంధీ చిత్రపటం, తల్లుల దినోత్సవం చిత్రపటం,శ్రీకృష్ణ భగవానుని చిత్రపటం మొదలగునవి వేయడం జరిగింది.నాట్య ప్రదర్శనలో భాగంగా ఏకదంతాయ అనే పాటకు ,మట్టిని తాకిన చేతులు అనే పాటకు, రఘుకుల తిలకా రారా అనే పాటకు, నీ గుడి ముందాల అనే పాటకు,సరిలేరు నీకెవ్వరు అనే పాటలకు డాన్స్ మాస్టర్ రవి శిక్షణ ద్వారా అద్భుతంగా నాట్య ప్రదర్శన చేయడం జరిగింది. పై కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని , మండల విద్యాధికారి బాణం విష్ణు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వరప్రసాదరావు మరియు ఉపాధ్యాయులు డి రణధీవ్,పి వెంకటస్వామి, కే మధుసూదన్, చిన్నారెడ్డి, సి అర్ పి సేవ్య ,వాలంటీర్లు రాధా, నందిని, ఎస్ రాధ, శ్రీ రవి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని ఈ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు.మండల విద్యాధికారి శ్రీ బాణం విష్ణు మాట్లాడుతూ..పెద్దమందడి మండలంలో మూడు ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమము విజయవంతంగా నిర్వహించబడిందన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వరప్రసాదరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొనుటకు కృషిచేసిన వాలంటీర్లు శ్రీమతి రాధా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్,నందిని, ఎస్ రాధ, శ్రీ రవి బాగా కృషి చేశారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఇటువంటి క్యాంపులు నిర్వహించడం వల్ల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పొందడానికి ఎంతో కృషి జరుగుతుందని తెలిపినారు. గ్లాస్ పెయింటింగ్ ద్వారా జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని చిత్రపటాన్ని విద్యార్థులు వారికి స్వయంగా అందజేయడం జరిగింది.అనంతరం పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.

# నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఆరోపణలు అవగాహన రహితం

- ఎమ్మెల్యే కు అభివృద్ధి చేతకాక నిరంజన్ రెడ్డి పై ఆరోపణలు
- నిరాధారణ ఆరోపణలపై న్యాయస్థానల్లో తెలుసుకుంటాం
- మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై ఎమ్మెల్యే మేఘా రెడ్డి చేసిన ఆరోపణలు అవగాహన రహితమైని, అభివృద్ధి చేతకాకే నిరంజన్ రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ విమర్శించారు. సోమవారం వనపర్తి లోని నిరంజన్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.నిరంజన్ రెడ్డి గంజాయి మొక్క కాదు..గరీబోల్ల పెన్నిధని నిరంజన్ రెడ్డి ఒక్క గుంట కబ్జా చేసినా రాజీనామాకు సిద్ధం నీవు సిద్ధమా అని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.ఫిర్యాదు నీవే చేస్తావు తీర్పు నీవే ఇస్తావా మేఘారెడ్డి.అభివృద్ధి చేతకాక బురద చల్లుతున్నావు.నిరాధార ఆరోపణలపై న్యాయ స్థానాలలో తేల్చుకుంటాం.ఈ సమావేశములో మాజీ మున్సిపల్ చైర్మన్ కర్రెస్వామి,మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తో కలసి దుయ్యబట్టారు. కృష్ణా నాయక్ మాట్లాడుతూ.. మేఘారెడ్డి 8ఏండ్ల క్రితం నీ చరిత్ర ఏందో ప్రజలకు తెలుసు అని నిరంజన్ రెడ్డి కాళ్ళు మొక్కి తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ అర్హత సంపాదించి కోట్లు సంపాదించుకొని అన్నం పెట్టిన ఇంటికి సున్నం పెట్టిన చరిత్ర నీది.ఎన్నికల ముందు నిరంజన్ రెడ్డి మీద లేనిపోని ఆరోపణలు చేసి 90మందితో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసి ఏం.ఎల్.ఏ గా గెలిచావు .బి.జె.పి ఎం.పి రఘునందన్ రావు,తొలివెలుగు రఘుతో కుమ్మక్కై 100ఎకరాలు కబ్జా చేశాడు నిరూపిస్తానని చెప్పిన నీవు ఆమాటకు కట్టుబడి ఉండకుండా తగుదునమ్మా అంటూ 2.19గుంటలు కబ్జా అయిందని అనడానికి సిగ్గుఉండాలి అని అన్నారు.మొత్తానికి మొత్తం కబ్జా అని వ్యక్తిగత కక్ష్యతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారుల పై ఒత్తిడి తెచ్చి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ కు ఫిర్యాదు చేసినావు.అధికారులు తేల్చింది వాళ్ళ కూతురు ప్రత్యూష 32గుంటలు బంధువు శేషిదర్ రెడ్డి,పావని భూమిలో చెరో 32గుంటలు ప్రభుత్వ భూమి మొత్తం 2.19గుంటలు ఉందని తేల్చారు.సంస్కార హీనంగా ఇక్కడ లేని కుటుంబ సభ్యులపై ఆరోపణ చేయడం నీకే దక్కింది. ఈ ఆరోపణలకు తగిన సమయంలో సమాధానం చెబుతారు.మేఘారెడ్డి మీరు అవగాహనతో మాట్లాడండి సర్వే చట్టాల ప్రకారం కొన్న భూమిలో 5శాతం ఎక్కువ తక్కువలు సర్దుబాటు ఉంటుందని సర్వే నిపుణులు చెబుతారు.సర్దుబాటు భూమిని కబ్జాగా చిత్రీకరించడం నీ అవగాహన రాహిత్యానికి నిదర్శనం.ప్రభుత్వం,అధికారం మీది అని లేనిపోని ఆరోపణలు చేస్తే న్యాయపరంగా నీ మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బి.ఆర్ ఎస్ ప్రభుత్వ హయాములో బుద్ధారం రైట్ కెనాల్ పనులలో నీవు చేసిన అవినీతి నిరూపించడానికి మేము సిద్ధంగా ఉన్నాము.గత ప్రభుత్వంలో పది రూపాయల పని చేసి 100రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన నీ అవినీతి గురించి న్యాయ విచారణ చేయాలని ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.సొంత అన్నదమ్ములకు ద్రోహం చేస్తే 10సంవత్సరాలు మాట్లాడకుంటే నిరంజన్ రెడ్డి పెద్ద దిక్కుగా రాజీ చేసి కోట్ల రూపాయల కాంటాక్ట్ ఇప్పించిన సంగతి మరిచిపోయారా.నీవు సొంతంగా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేక, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక అక్కసుతో ఇతరుల మీద బురద చల్లితే ప్రజలే బుద్ధి చెబుతారని కృష్ణా నాయక్ హెచ్చరించారు. పెబ్బేరు సంత స్థలం హరి హారదులు ఏకమైన సాధిస్తాం అన్న హామీ ఎక్కడ పోయింది. కర్రెస్వామి మాజీ మున్సిపల్ చైర్మన్.35ఏండ్లుగా న్యాయస్థానాలలో ఉన్న భూమిని సామరస్యంగా పరిష్కరించిన నిరంజన్ రెడ్డి మీద దుష్ప్రచారం చేసి 30ఎకరాలు నెలలోపు సాధిస్తానని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని పెబ్బేరు ప్రజలను మోసం చేసావని కర్రెస్వామి ఆరోపించారు.వనపర్తిలో ఉన్న వివాదస్పద భూమి నిరంజన్ రెడ్డి కబ్జా చేశాడని నిందా ఆరోపణలు చేసిన నీవు 18నెలలు గడిచిన నిరూపించలేకపోయావు.ఆరోపణలు నిరూపణ చేయలేని నీవు రాజీనామా చేయాలని కర్రెస్వామి డిమాండ్ చేశారు.హామీలు అమలు చేయలేక ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేస్తున్నారని ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ అలసత్వాని అడుగు అడుగునా ప్రశ్నిస్తున్న నిరంజన్ రెడ్డి మీద అక్కసుతో లేనిపోని ఆరోపణలతో ఎమ్మెల్యే కాలక్షేపం చేస్తున్నాడని కర్రెస్వామి తీవ్రంగా విమర్శించారు.రోడ్ల విస్తరణ, ఐ.టి.హాబ్, ఇంటిగ్రేటెడ్ విద్యా సముదాయాలు,పాలిటెక్నిక్ ఆధునీకరణతో పాటు ప్రభుత్వ హామీలు రైతు బంధు, రైతు భరోసా రైతు రుణ మాఫీ ధాన్యంపై 500బోనస్, మహిళకు 2500. తులం బంగారం,నిరుద్యోగ భృతి, కె.సి.ఆర్ కిట్టు వంటి పథకాలు అమలు చేసి నిరంజన్ రెడ్డి చేసిన అభివృద్ధిని మించి అభివృద్ధి చేసి చూపాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశములో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ అధ్యక్షులు పలుస.రమేష్‌గౌడ్, మార్కఫేడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, సోషల్ మీడియా అధ్యక్షులు సునీల్ వాల్మీకి,యూత్ అధ్యక్షులు సూర్యావంశం గిరి,మంద.రాము,అలీం,శంకర్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# ఖమ్మంలో సైబర్ నేరస్థుడి అరెస్టు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఆన్ లైన్ బెట్టింగ్ కి అలవాటు పడి ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్ టేకర్ గా ఉద్యోగంలో చేరి అతనికే తెలియకుండా అతని అకౌంట్ నుండి సుమారు 11.49 లక్షలు బెట్టింగ్ కు పాల్పడిన వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలిసులు అరెస్టు చేసినట్లు సిపి సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మధిర మండలంలోని నిదానపురం గ్రామానికి చెందిన 20 సంరాల గుండా వెంకటేశ్వరరెడ్డి అనే యువకుడు ఖమ్మంలోని ఖమ్మం హోమ్ కేర్ సర్వీస్ లో కేర్ టేకర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి గత నాలుగైదు సం. నుండి ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడేవాడు. ఇందులో భాగంగా గత మార్చిలో ఇతను ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి అయిన గాదె కేశవరావు దగ్గర కేర్ టేకర్ గా ఉద్యగంలో చేరాడు. నేరస్థుడు అయిన వెంకటేశ్వర్ రెడ్డి ఆన్ లైన్ బెట్టింగ్ కి వ్యసనపరుడై అతని యజమాని దగ్గర కేర్ టేకర్ గా ఉంటూనే అతనికి తెలియకుండా అతని ఫోన్ లోని గూగుల్ ఫే ద్వారా బెట్టింగ్ ఆప్ లలోకి డబ్బులు డిపాజిట్ చేసి బెట్టింగ్ కు పాల్పడేవాడు. ఈ విధంగా మార్చిలో సుమారు రెండువారాలు వరుసగా సుమారు 11.49 లక్షల డిపాజిట్ చేసి ఆన్లైన్ బెట్టింగ్ ఆడాడు. ఎవరికి అనుమానం రాకుండా గూగుల్ ఫే హిస్టరిని మరియు జి మెయిల్ హిస్టరిని డెలీట్ చేశాడు. సదరు యజమాని కేశవరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సదరు నేరస్థుడుని గుర్తించి విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకొన్నాడు. నిందితుడుని ఖమ్మం సైబర్ క్రైం కోర్ట్ లో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణిందర్ ని ఎస్సైలు రంజిత్ కుమార్ విజయ్ కుమార్ మరియు సైబర్ క్రైమ్ పోలిసు స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సిపి అభినందించారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ఫిర్యాదు



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం మరియు కౌకుంట్ల మండలం ఊక చెట్టు పెద్దవాగులో ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని సోమవారం లా విద్యార్థి, ఆర్టీఐ చట్టం ఆక్టివిస్ట్స్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు మంగరాయి వెంకటేష్ లోకయుక్త కోర్టులో ఫిర్యాదు చేశారు. వాగులోని తరలించవద్దని రైతులు గ్రామస్తులు వాగులోని వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయని,భూగర్భ జలాలు ఇంకి పోతాయని,పశువులకు మనుషులకు తాగడానికి ఇబ్బంది కలుగుతుందని ఇసుక రవాణాన్ని అడ్డుకున్న రైతులను లెక్కచేయకుండా తరలిస్తున్నారని తెలిపారు.అధికారులపై ఫిర్యాదు చేయడం జరిగింది.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**సామాజిక కార్యకర్తగా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు , రైజింగ్ హాండ్స్ సొసైటీ టీమ్ మెంబర్ గా మండల కేంద్రంగా సేవలందిస్తూ పని చేస్తున్న కీలక నేత కొమ్ము విష్ణు కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. విష్ణు తల్లి కొమ్ము బాల మణెమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. సోమవారం పెద్దమందడి మండలం స్వగ్రామం పెద్ద మందడి గ్రామంలో బాలమనెమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి ఘన నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కొమ్ము విష్ణు కుటుంబానికి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలిపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ,సింగిరెడ్డి వెంకటస్వామి ముప్పూరి మహేష్ ,ముప్పూరి మధు,మరియు కొమ్ము శివ,రాజు మిత్రులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ, అంగన్వాడి నూతన భవనాలకు నిధుల మంజూరు పట్ల హర్షం

- వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలనికి నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడి భవనాల నిర్మాణ పనులకు 64 లక్షల నిధులు మంజూరు అయ్యాయని వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయడం పట్ల వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామ నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షలు, నాగులకుంట తండా గ్రామపంచాయతీ భవనానికి 20 లక్షలు అలాగే మోజర్ల గ్రామ అంగన్వాడి భవనానికి 12 లక్షలు, అమ్మపల్లి గ్రామ అంగన్వాడి భవనానికి 12 లక్షలు నిధులు మంజూరు కావడంతో రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే నిధుల మంజూరుకు కృషిచేసిన వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి కి పెద్దమందడి మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. మండల అభివృద్ధికి వనపర్తి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. నూతన భవనాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ప్రోసిడింగ్ జారీ చేసినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలుశిక్ష

- ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్
- సత్తుపల్లి రూరల్ సిఐ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి వి.శివ రంజని సోమవారం తీర్పు ఇచ్చారని సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగయ్య తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి..ఏన్కూరు మండలం తూతి లింగన్నపేట కు చెందిన నామ నరేష్ (34) అనే నిందుతుడు పెళ్లి అయిన రెండేళ్ళ నుండి తన భార్య తేజశ్రీ ని అదనపు కట్నం కోసం నిత్యం చేస్తున్న మానసికంగా,శారీరకంగా వేధింపులను తట్టుకోలేక 2019 జూన్ 9 ఆత్మహత్య కు పాల్పడిందని, మృతురాలు తండ్రి ఫిర్యాదుతో స్థానిక ఏన్కూరు పోలీస్ స్టేషన్ లో కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశామని తెలిపారు. సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి.స్వప్న, యండీ ఇషాద్ వాదించారు. ప్రాసిక్యూ షన్ కు సహకరించిన ఏసీపీ రఘు, ఏన్కూర్ అప్పటి ఎస్సై పవన్ కుమార్, ప్రస్తుత ఎస్సై ఉఫాతుల్ రఫి, సీడీఓ. డి.భారత్, లైజన్ అధికారులు కె.శ్రీకాంత్, డి. నాగేశ్వరరావు, హోంగార్డు శ్రీనివాస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.





# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి..

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** పైలెట్ గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్, కొనిజర్ల మండలం చిన్నగోపతి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఇండ్ల లబ్ధిదారులతో నిర్మాణంలో సాదకబాదకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం కావాలి, ఇసుక, మట్టి అందుతుందా అడిగి తెలుసుకున్నారు. సిమెంట్, స్టీల్ తదితర సామాగ్రి గ్రూప్ గా ఏర్పడి, ఒకేచోట కొంటె తక్కువ ధరకు దొరుకుతుందని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 20 మండలాల నుండి ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. పైలట్ గ్రామాల్లో 875 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ అన్నారు. మంజూరు ఇండ్లలో 568 ఇండ్లు పునాదుల స్థాయి, 442 బేస్మెంట్ పూర్తి, 70 ఇండ్లు రూఫ్ స్థాయి, 5 స్లాబ్ స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. 420 మందికి చెల్లింపులు చేసినట్లు కలెక్టర్ అన్నారు. పునాది పూర్తయిన తర్వాత రూ. లక్ష, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. 1.25 లక్షలు, స్లాబ్ దశలో రూ. 1.75 లక్షలు, నిర్మాణం పూర్తిగా పూర్తయిన తర్వాత రూ. లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తామని కలెక్టర్ అన్నారు. అర్హులై పునాది స్థాయి వరకు కట్టుకోలేని వారికి మహిళా సంఘాల ద్వారా డబ్బు ఇప్పించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అన్నారు. చిన్నగోపతి గ్రామంలో 52 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 43 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు తెలిపారు. 5 ఇండ్లు రూఫ్ స్థాయి, 10 ఇండ్లు లేంటల్ స్థాయి, మిగతావి బేస్మెంట్ స్థాయిలో ఉన్నాయన్నారు. అధికారులు ఇండ్ల పురోగతిని నిరంతర పర్యవేక్షణ చేయాలని, లబ్ధిదారులకు ప్రతి దశలో ప్రభుత్వం నుండి సహకారం అందించాలని, తక్కువ ధరలో నాణ్యమైన నిర్మాణం చేపట్టేలా సలహాలు, సహకారం అందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఇంచార్జ్ తహసీల్దార్ రాము, హౌజింగ్ డిఇపి. సాయిరాం రెడ్డి, ఏఇ ఉమామహేశ్వర రావు, చిన్నగోపతి పంచాయతీ కార్యదర్శి జ్యోతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మాదిగలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి

- రాగల్ల ఉపేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** మాదిగ దండోరా ఉద్యమం 30 ఏళ్లుగా అణగారిన మాదిగలకు అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, హక్కులను ప్రసాదించిందని, ఇక సమాజంలోని అన్ని వర్గాల శ్రేయస్సు కోసం మాదిగలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు.

ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశం జరిగింది. మండల ఇన్‌చార్జ్ జేరిపోతుల సుధాకర్ మాదిగ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ

"ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మాదిగల చిరకాల ఆకాంక్ష. దీన్ని సాధించడం ద్వారా ఉద్యమ విజయానికి గర్వంగా నిలిచాం. ఈ పోరాటానికి గుర్తింపుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీ అవార్డు మందకృష్ణ మాదిగకి రావడం, మన జాతికే కాదు, సబండ వర్గాలకూ గర్వ కారణం." అయితే రిజర్వేషన్ల అనే నాణానికి ఒకవైపు డాక్టర్ అంబేద్కర్ ఉంటే, మరొకవైపు మందకృష్ణ మాదిగ ఉన్నారని అభిప్రాయపడ్డారు.

ఇక నుండి సమాజ మద్దతుతో సాగిన ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని, అన్ని అనుబంధ విభాగాలను పునర్నిర్మిస్తూ రాజకీయాలకు అతీతంగా సామూహిక ఐక్యత అవసరమని పిలుపునిచ్చారు. మాదిగల అస్తిత్వాన్ని, రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడుకుంటూనే సామాజిక ప్రభావాన్ని పెంచేలా పునఃఐక్యత తప్పనిసరని చెప్పారు.

పద్మశ్రీ అవార్డు పురస్కరించుకుని స్టేషన్ఘన్పూర్ కేంద్రంగా మందకృష్ణ మాదిగకి ఘనంగా ఆత్మీయ సన్మాన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామాల్ని ఉద్యమ కేంద్రాలుగా మార్చి, శాస్త్రీయంగా, సైద్ధాంతికంగా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ, జనగామ జిల్లా ప్రతినిధి సందేన రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# అర్జీలు వెంటనే పరిష్కరించాలి...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఎం. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన 7వ తరగతి చదువుతున్న వి. దివ్య, తనకు బోనకల్ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఎస్.సి. అభివృద్ధి అధికారికి రాస్తూ వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామానికి చెందిన షేక్ ఉద్దండు సాహెబ్ తమ ఇంటి నుండి ఊర్లోకి వెళ్లకుండా అడ్డంగా కంచె కట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డివిజనల్ పంచాయతీ అధికారికి రాస్తూ విచారించి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరానికి చెందిన సింగాల నాగమణి తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌజింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం బీకే బజార్ కు చెందిన ఏ. శ్రీ లక్ష్మి తనకు ఎవరూ లేరని అనాధగా ఒంటరిగా జీవిస్తున్నానని, తనకు ఉపాధి కల్పించాలని, అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లేదా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ తహసిల్దార్, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్‌కు వీర నారీమణుల ఫిర్యాదు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లా కలెక్టర్ ముజమిల్ ఖాన్ కు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రఘునాధపాలెం , పువ్వాడ ఉదయ నగర్ కాలనీకు సంబంధించిన పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు విషయంలో జరిగిన అక్రమాలు, అదేవిధంగా భూకబ్జాల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. పువ్వాడ ఉదయ్ నగర్ కాలనీలో ప్రభుత్వ భూముల కేటాయింపులో అనేక అవకతవకలు జరిగాయని , అనహరులకే ఇళ్ల స్థలాలు లభించాయని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ , ఆమె భర్త బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు రవి , కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిద్దయ్య లు గ్రామ కార్యదర్శి తో కలిసి చేసిన అవినీతి పై అనేక ఫిర్యాదులు చేశామని జిల్లా కలెక్టర్ కు సమర్పించిన ఫిర్యాదు పత్రంలో ఆరోపించారు. అసైన్ భూములలో కూడా అన్యాక్రాంతానికి దిగిన వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. వాడ ఉదయ్ నగర్ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరుతో కమ్యూనిటీ హాలు ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీ ప్రభుత్వ స్థలాల లో బోర్డు లు ఏర్పాటు చేయాలని కోరారు. సమితి జిల్లా ఉపాధ్యక్షులు విజయ నాయకులు త్రివేణి , జ్యోతి , లలిత , లక్ష్మి , శారద, సరోజిని, సుభద్ర పాల్గొన్నారు.

# సేంద్రీయ సాగు పంటల ఆర్గానిక్ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం..

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**


**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేసిన ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం వల్ల ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

సోమవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరం ఎన్ఎస్పీ రోడ్, వీడియోస్ కాలనీ లోని సమీకృత మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిరుపయోగంగా ఉన్న నాన్ వెజ్ మార్కెట్ ను ఆర్గానిక్ ఉత్పత్తుల మార్కెట్ గా ఏర్పాటు చేసేందుకు అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సహజ సిద్దంగా పండించే పండ్లు, బియ్యం, పలు రకాలైన ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెట్ లో కనీస సౌకర్యాలు కల్పించాలని, మార్కెట్ కు ఆకర్షనీయమైన రంగులు వేయాలని, రైతులకు స్టాల్స్ కేటాయించాలని, వివిధ రకాల సూచనలు చేస్తూ వారం, పది రోజులలోపు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రసాయనాల వాడకాల ఉత్పత్తుల వలన ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, దళారులు లేకుండా రైతులు నేరుగా అమ్ముకునేలా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మన పూర్వీకులు చాలా ఆరోగ్యంగా ఉన్నారని, ఇప్పుడు ఉన్న కాలంలో మాత్రం మన ఆరోగ్యం తగ్గిపోతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సేంద్రీయ వ్యవసాయం ప్రస్తుతం చాలా అవసరమని అన్నారు. ఎరువులు, మందులు వాడకుండా పండించిన వ్యవసాయ పంటలు ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. రైతులకు లాభం పెరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతున్నాడమని అన్నారు. అర్గానిక్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, సరైన వేదిక



కోసం ఖమ్మం జిల్లాలో వారం, పది రోజులలోపు ఆర్గానిక్ ఉత్పత్తులతో హెల్త్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని, రైతులు నేరుగా వినియోగదారులకు అమ్ముకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇఇ కృష్ణలాల్, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ షఫీయుల్లా, మార్కెట్ కార్యదర్శి శ్వేత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 11వ మహాసభ కు గ్రామీణ వైద్యులు భారీగా తరలి రావాలి..

**జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ హసన్, షేక్ జానీ మియా...**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు: తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల మహాసభ ఈనెల 22న ఖమ్మం నగరంలోని టిటిడిసి హవేలీ రెస్టారెంట్ ఎదురుగా నందు గల హాల్లో జరగనుందని సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్, జిల్లా కార్యదర్శి షేక్ జానీ మియా పిలుపునిచ్చారు. సోమవారం సంఘ కార్యాలయంలో సంఘం 11వ మహాసభ పై నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు ,ఈ సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో పాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంఘ రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు సమావేశం సందర్భంగా గత సంవత్సరం ప్రగతి నివేదిక భవిష్యత్ కార్యక్రమంతో పాటు పలు తీర్మానాలు చేస్తామన్నారు, తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంక్షేమం ప్రధాన తీయంగా మనం సంఘటితంగా సమస్యల సాధన పై ఉద్యమిస్తూ ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ హసన్, వ్యవస్థాపకులు షేక్ నజీరుద్దీన్ ,జిల్లా నాయకులు ఖాసీం ,ఆశ ,చాంద్ పాషా, మొహమ్మద్, అఫ్జల్ ,షాజహాన్, శ్రీరామ్ గిరి జానీ, అమీర్, ఇసాక్, మన్సూర్ అలీ, నాగుల్ మీరా, సుల్తాన్ బాబా, యాసిన్, సొందుమియా, ఖలీల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు





# జర్నలిస్టు మల్లూరు ను కలిసిన సీపీఎం, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు!

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**

వేంసూరు మండలం, ఖమ్మం జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు, వేంసూరు మండల కార్యదర్శి,టి. డబ్ల్యూ. జె.ఎఫ్ జిల్లా కమిటి సభ్యులు జర్నలిస్టు మల్లూరు చంద్రశేఖర్ సతీమణి వెంకటేశ్వరి ఈ నెల 11 న ప్రమాదవశాత్తూ కిందపడగా ఆమె ఎడమ కాలుకు మడమ వెనుక భాగంలో ఫ్యాక్చర్ అయిన విషయం పాఠకులకు విదితమే. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం నగరంలోని శివ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో జాయిన్ అవగా సోమవారం 19 వ తేదీ ఉదయం ఆర్థోపెడిక్ సర్జన్ నంబూరు సునీల్ చాకచక్యంగా శస్త్ర చికిత్స చేసి సర్జరీ ను సక్సెస్ చేశారు. అనంతరం నంబూరు కు మల్లూరు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. అట్టి విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ సీపీఎం కార్యదర్శి మడిపల్లి గోపాలరావు లు వెంకటేశ్వరి ను పరామర్శించి ఎర్ర జెండా అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు. అనంతరం టి. డబ్ల్యూ.జె.ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు పరామర్శించారు. వారితో పాటు జిల్లా ఉపాధ్యక్షులు బోయినపల్లి అంజయ్య, నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ లు పాల్గొన్నారు.

# టేక్మాల్ లో నేడు హాజ్రాత్ సయ్యద్ బుర్హానుద్దీన్ ఔలియా రహ్మాతుల్లాహి అలై ఉర్సు ఉత్సవలు..

● జిల్లా మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి యంఏ సలీమ్.



**మెదక్ బ్యూరో, టేక్మాల్, తెలంగాణ ముచ్చట్లు:** టేక్మాల్ మండల కేంద్రంలో నేడు సాయంత్రం ఉర్సు ఉత్సవాలు 5:30 గంటలకు ప్రారంభం జామే మస్జీద్ నుండి గ్రామ ప్రతి వాడల తీరగుతూ గంధము ఊరేగింపు గా దర్గాలో సమర్పిస్తారు. రాత్రి 7 గంటలకు జల్సే అజ్మాతే ఔలియా నాత్యా మహెఫిల్ కార్యక్రమం జరుగుతుందని యంఏ సలీమ్ తెలిపారు.
ఈసందర్భంగా మెదక్ జిల్లా ముస్లిం మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి యంఏ సలీమ్ మాట్లాడుతు. ఉర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథి హాజ్రాత్ సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హోసిని హుసేని ఖాద్రి గారు (అఖిల భారత జామ్యాతుల్ మషాయఖ్ అధ్యక్షులు మౌలాన హామీద్ రహ్మాని, అధ్యక్షులు ఆఖిల భారత తన్జీమే ఇస్లాహె మాషెర మౌలానా సయ్యద్ లియాఖతుల్లా హుస్సైనీ, మౌలానా ఫరూక్ అజీజ్, మౌలానా శౌకత్ రజా, సయ్యద్ ముజీబ్, మౌలానా వాజిద్ పాషా ఇంక ప్రసిద్ధి చెందిన గురువులు వచ్చి సోఫి సిద్ధాంతులను వివరిస్తారు.ఈ కార్యక్రమం తర్వాత మౌలానా ఉమర్ ఫరూక్ గారి ఆధ్వర్యంలో నాతీయ మహాఫిల్ హాజరు అవుతారని అన్నారు.
21052025, బుధవారం నాడు ఉదయం 7గంటల నుండి ఆందావత్ సమోహిక భోజనాలు దర్గా యందు జరుగును.
రాత్రి మహాఫైలే చిరగన్ దీపారాధన జరిగే కార్యక్రమానికి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఉమ్మిడి మెదక్ జిల్లా మైనారేటి రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి యం ఏ సలీమ్ గ్రామ ప్రజలను ప్రజాప్రతినిధులను కోరారు.



# పుట్టు చీర కార్యక్రమానికి హాజరైన తూడి శారదారెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ బాలరాజు కూతురు పుట్టు చీర కార్యక్రమానికి ఎమ్మెల్యే సతీమణి తూడి శారదారెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఆడపిల్లల జీవితంలో కొన్ని ముఖ్యమైన రోజులు ఉంటాయని అలాంటి రోజులను తల్లిదండ్రులు వారి భవిష్యత్తులో గుర్తుండిపోయేటట్లుగా నిర్వహించుకోవడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె చిన్నారి కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగి సందడి చేశారు.

# ప్రభుత్వ పుస్తకాల విక్రయాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్



**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:** మెదక్ లలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను దుకాణాల ద్వారా విక్రయించడానికి జిల్లాలోని పట్టణ, మండల పరిధిలలోని విక్రయదారులు అవసరమైన ఇండెట్ల కోసం ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అనుమతి పొందిన విక్రయదారులు జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ప్రొసీడింగ్తో పాటు రూ.వెయ్యి జిల్లా విద్యాశాఖాధికారి మెదక్ పేరిట డీడీని జత చేయాలని సూచించారు. గత సంవత్సరం ఇచ్చిన పాఠ్యపుస్తకాల్లో మిగిలిన వాటి జాబితాను తరగతుల వారీగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.
అనుమతి పొందాలనుకునే వారు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ కార్మికశాఖాధికారి ఆనుమతి పత్రాలతో గత సంవత్సరం అమ్మకాల టర్నోవర్ చెల్లించిన అమ్మకం పన్ను రసీదు సైతం జతపరచాలన్నారు. ఇట్టి పత్రాలన్ని 202526 సంవత్సరాలకు చెల్లింపు రసీదు కలిగి ఉండాలన్నారు.

# రైతు నమోదు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలి

- రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- తాటికాయల ఏఈఓ జయశ్రీ

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** రైతులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల నుంచి మరింత లబ్ధి పొందాలంటే ప్రతి ఒక్కరూ రైతు నమోదుకు హాజరుకావాలని తాటికాయల గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారి జయశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మసాగర్ మండలంలోని రాయగూడెం రైతు వేదికలో ఉదయం పది గంటల ముప్పై నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు రైతు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.
ఈ కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయబడుతుందని, ఆ సంఖ్య ఆధారంగా పంటల భీమా, పెట్టుబడి సహాయం, వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర ప్రోత్సాహక పథకాల లబ్ధిని పొందగలిగే అవకాశం కలుగుతుందని జయశ్రీ వివరించారు.
నమోదు కోసం వచ్చే రైతులు తమ ఆధార్ గుర్తింపు పత్రంతో పాటు భూమి పాసుపుస్తకం, ఆధార్కు అనుసంధానమైన మొబైలు నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని, మండలంలోని రైతులందరూ నిర్దిష్ట సమయంలో హాజరై నమోదు పూర్తి చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.





# పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో జిల్లాలో బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తాం...

- పోతినేని, నున్న
- నగరంలో భారీ ర్యాలీ ...
- సిపిఎం పార్టీలో భారీ చేరికలు...

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సందర్భంగా సిపిఎం ఖానాపురం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందు క్రాస్ రోడ్ నుండి ఇందిరా నగర్ లో ఉన్న సిపిఎం పార్టీ ఆఫీస్ వరకు ఎర్రదండు కవాతు నిర్వహించి అనంతరం సిపిఎం హవేలీ కమిటీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ నేడు భారతదేశ అత్యంత క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొంటుందని ఈ పరిస్థితులకు కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వమే కారణమని, దేశంలో శాంతి భద్రతలు అదుపులో లేకుండా చేసి దేశంలో ఉన్న ప్రజలను హిందూ ముస్లింలుగా విభజించి మత కల్లోలాలు సృష్టించటం కోసం ఉగ్రవాదాన్ని అడ్డంపెట్టుకుని ఈ దేశంలో శాంతి లేకుండా చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ టెర్రరిస్ట దాడులకు కేంద్రమే బాధ్యత వహించాలని దేశంలో శాంతి నలకలు పై విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో వామపక్షాలు బలహీనపడటం వల్ల, ప్రతిపక్షాలన్నా, ప్రజలన్నా,లెక్కలేని తనంతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఈ దేశానికి వామపక్షాలేమని ప్రజలు నేడు గుర్తిస్తున్నారని, భవిష్యత్తులో మహానేత పుచ్చలపల్లి సుందరయ్య చూపిన మార్గంలో పయనిస్తూ, ఆయన ఆచరణలను తూచా తప్పకుండా పాటిస్తూ, ప్రజా సమస్యలపై పోరాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ ఈ జిల్లాలో బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. సుందరయ్య బాల్య దశలోనే అనేక రకాల పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని తన 15 స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని కమ్యూనిస్టు గాంధీగా పేరు తెచ్చుకున్నారని, ఈ దేశ స్వాతంత్రం కోసం అనేక సంవత్సరాలు జైలు జీవితాన్ని అజ్ఞాతవాసాన్ని ఆయన అనుభవించారని, అలాంటి పోరాట యోధుడు కామ్రేడ్ సుందరయ్య అని కొనియాడారు. పార్లమెంటరీ నేతగా ప్రతిపక్ష హోదాలో నెహ్రూ గారి ప్రభుత్వంతో సమస్యలపై కొట్లాడి, సాగునీటి రంగంలో ఆయన అనేక పరిశీలనలు, పరిశోధనలు చేసి అనేక సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి ప్రభుత్వానికి అందజేశారని దాని ఫలితంగానే నేడు అనేక సాగునీటి ప్రాజెక్టులు తెలంగాణలో ఏర్పడ్డాయని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి రూపకల్పన చేసి స్వయంగా గెరిల్లా దళాలు ఏర్పాటు చేసి భూస్వాములకు, జమీందారులకు, జాగిర్దారులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి వీరోచిత పోరాటం చేసి తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూమిని స్వయంగా పగ్గాలతో కొలిచి పంచారని, 4000 గ్రామాల విముక్తి కి కారకులయ్యారని వారి సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సుందరయ్య తన సొంత జిల్లాలోనే వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి కూలీ సమస్యలపై భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారని దళితుల పై జరుగుతున్న అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి విజయం సాధించారని అన్నారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పార్టీకి తొలి జాతీయ కార్యదర్శిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేశారని, నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని ఆటంకాలు వచ్చినా అధిగమించి ఎలా పని చేయాలో విప్లవకారులుగా ఎలా పని చేయాలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారని అన్నారు.

**సిపిఎం పార్టీలో భారీ చేరికలు...**

సిపిఎం పార్టీ ఖానాపురం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో నేడు జరిగిన సుందరయ్య 40 వర్ధంతి సందర్భంగా జరిగిన బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ గారు జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు గారి సమక్షంలో టేకులపల్లి ప్రాంతానికి చెందిన చిలకల వెంకటేశ్వర్లు, మరియు ఆయనతోపాటు మరి కొంతమంది పార్టీలో చేరడం జరిగింది. చిలకల వెంకటేశ్వర్లు గతంలో హవేలీ సిపిఎం పార్టీలో తురుకైన కార్యకర్తగా డివిజన్ స్థాయి నాయకుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా చిలకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేను పార్టీని వీడిన నా హృదయంలో సిపిఎం పార్టీ తప్ప వేరే పార్టీకి చోటే లేదని, సిపిఎం పార్టీలోనే నైతిక విలువలు ఉంటాయని, నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తారని, పేద ప్రజల కోసం ఏదైనా చేయాలి అంటే అది సిపిఎం పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని నమ్మి మళ్ళీ తిరిగి నా సొంత ఇంటికి వచ్చినానని తెలిపారు. కన్నతల్లి లాంటి పార్టీని ఎర్రజెండాని నా తుది వరకు విడవబోనని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా చిలకల వెంకటేశ్వర్లు కి పార్టీ కండువాకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బొగ్గవీటి సరళ, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, పిన్నింటి రమ్య, తుమ్మ విష్ణువర్ధన్, పారుపల్లి ఝాన్సీ,ఎంఏ జబ్బార్, ఎస్కే మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి ,తాళ్లపల్లి కృష్ణ, బోడపట్ల సుదర్శన్, భూక్య శ్రీనివాస్, బత్తిన ఉపేందర్, ఎస్.కె నాగుల్ మీరా, వజినేపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వెల్లంపల్లి వెంకట్రావు, యర్రా గోపి, గాలి వెంకటాద్రి కత్తుల అమరావతి పోతురాజు వెంకటి మరియు సిపిఎం పార్టీ హవేలీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ ల రాష్ట్ర రజతోత్సవ సభలను జయప్రదం చేయండి

- టీయూడబ్ల్యూజే (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ.. చిర్రా రవి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ల రజతోత్సవ వేదికలు హైదరాబాద్ లో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నామని, ఈ సభలను జర్నలిస్టులు విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ,చిర్రా రవి లు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని శ్రీ రక్ష రిహాబ్ బుద్ధ సెంటర్ లో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం తమ యూనియన్ పనిచేస్తూ వస్తుందని తెలిపారు. ఈనెల 31న హైదరాబాద్ లో
జరిగే పి జె ఎఫ్ రజతోత్సవ సభకు జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని అందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. పండగ వాతావరణం తలపించే రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో జర్నలిస్టులను చైతన్య పరుస్తూ రజతోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.
ఈ సమావేశం లో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శెట్టి రజినీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, ఆర్ టీవీ జిల్లా బ్యూరో బి.ఉదయ్,వనం నాగయ్య, టి. ఎస్.చక్రవర్తి,మందుల ఉపేందర్ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షుకార్యదర్శిలు యలమండల జగదీష్, కర్రిషా అశోక్, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు శ్రీధర్ శర్మ ,హరీష్, , ముత్యాల కోటేశ్వరరావు , బిక్కిగోపి, మూలజీవన్ రెడ్డి,వెంకటకృష్ణ, శేఖర్, నల్లమోతు శ్రీనివాస్ రావు, సాయి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కిరణ్, ప్రజా వాక్యం వెంకటేశ్వర్లు, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజావానికి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జిదారులతో దరఖాస్తు తీసుకున్నారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రసంగిస్తూ.. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా మంత్రి ద్వారా జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. నేడే ప్రజావాణి కి మొత్తం 45 ఫిర్యాదులు వచ్చినట్లు తెలపారు . ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి జిల్లా అదునపు ( రెవిన్యూ) కలెక్టర్ వెంకటేశ్వర్లు,వనపర్తి జిల్లా జడ్పీ సీఈఓ ఇంచార్జ్ లోకల్ బాడీ స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య, కలెక్టర్ సీసీ కిరణ్ కుమార్ రెడ్డి ,వనపర్తి ఆర్టీవో సుబ్రహ్మణ్యం,వివిధ శాఖల అధికారులు,అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

మండలం విద్యాధికారి బాణం విష్ణు



**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:** నేటి నుండి పెద్ద మందడి మండలలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు 5 రోజులపాటు బలిజపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నమని మండల విద్యాధికారి బాణం విష్ణు తెలిపారు. ఈ శిక్షణలో మండలంలో అందరు సెకండరీ గ్రేడ్ టీచర్లు మరియు ఎల్ ఎఫ్ ఎల్ హెడ్మాస్టర్లు పాల్గొంటారు.కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్ అనే అంశం మీద శిక్షణ కార్యక్రమం జరుగుతుంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వాళ్లు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలుగు,ఇంగ్లీషు, గణితము ఈవీఎస్ లకు సంబంధించిన ప్రతి అంశంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఉంటుంది.విద్యార్థుల ఎన్రోల్మెంట్ , క్వాలిటీ ఎడ్యుకేషన్ అంశాల మీద ఇందులో మన మండలం నుంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆర్పీలుగా వ్యవహరిస్తూ.. ఈ కార్యక్రమంలో అన్ని అంశాలను ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఏసీలో ఉండి నేరుగా ఎండలోకి వెళ్లడం ఎంత ప్రమాదమో తెలుసా ?




ఎక్కువసేపు ఏసీలో ఉండి నేరుగా ఎండలోకి వెళ్లే అలవాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. ముఖ్యంగా వేసవి మధ్యాహ్న సమయాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్య దృక్కోణం నుండి, చాలా సులభమైన దశలతో పెద్ద ప్రమాదాలను నివారించవచ్చు. వేసవిలో ఎండలు మండిపోతుంటాయి. ఉష్ణోగ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఇంత వేడిగా ఉండకుండా ఉండటానికి, ప్రజలు ఇంట్లో, ఆఫీసులో ఏసీని ఆశ్రయిస్తారు. చాలా కార్యాలయాల్లో ఏసీ నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. ప్రజలు దాని చల్లని వాతావరణంలో ఎక్కువసేపు పని చేస్తారు. కానీ Aఙ తర్వాత వెంటనే ఎండలోకి వెళ్లడం, ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎండలోకి వెళ్లడం చాలా హానికరమని చెబుతున్నారు నిపుణులు. ఏసీ వాతావరణంలో ఉష్ణోగ్రత సాధారణంగా 20 మరియు 24 డిగ్రీల మధ్య ఉంటుంది, అయితే వేసవిలో బయటి వాతావరణం ఉష్ణోగ్రత 40 నుండి 45 డిగ్రీలకు చేరుకుంటుంది. ఈ విధంగా లోపల, బయట ఉష్ణోగ్రత మధ్య దాదాపు 20 నుండి 25 డిగ్రీల వ్యత్యాసం ఉంటుంది. శరీరం చల్లని వాతావరణంలో ఉన్నప్పుడు, అకస్మాత్తుగా వేడి ఎండకు గురైనప్పుడు, శరీర ఉష్ణోగ్రత సమతుల్యత చెదిరిపోతుంది. ఈ పరిస్థితి హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్, రక్తపోటులో మార్పులు వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

డయాబెటిస్, బీపీ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి: ముఖ్యంగా డయాబెటిస్ లేదా అధిక రక్తపోటు సమస్యలు ఉన్నవారు అదనపు జాగ్రత్తగా ఉండాలి. అలాంటి వారికి అకస్మాత్తుగా ఎండలో తిరగడం వల్ల మెదడు రక్తస్రావం లేదా గుండెపోటు వంటి తీవ్రమైన పరిస్థితులు తలెత్తుతాయి. ఏసీలో ఎక్కువసేపు ఉండి, ఎండలో బయటకు వెళ్లిన తర్వాత తల తిరగడం, భయము, వాంతులు, లేదా హృదయ స్పందన రేటు పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఎండ తీవ్రతను నివారించడానికి ఏసీ నుంచి బయటకు వచ్చేటప్పుడు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మొదటి అడుగు ఏమిటంటే, బయటకు వెళ్ళే ముందు ఆఫీసు ప్రవేశ ప్రాంతంలో లేదా ఏసీ లేని ప్రాంతంలో కొంత సమయం నిలబడి మీ శరీరాన్ని ఎండకు సిద్ధం చేసుకోవడం. ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పు కారణంగా చాలా త్వరగా ఎండలోకి వెళ్లడం హానికరం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు ఖాళీ కడుపుతో బయటకు వెళ్లకూడదు. తేలికపాటి చిరుతిండి లేదా కొంత ద్రవంతో బయటకు వెళ్లడం మీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాగే, ఎండలోకి వెళ్ళే ముందు శరీరాన్ని, ముఖ్యంగా తలని టోపీ, స్కార్ఫ్ లేదా టవల్ తో కప్పుకోవడం చాలా ముఖ్యం. ఇది ప్రత్యక్ష ఉష్ణోగ్రత ప్రభావాల నుండి రక్షిస్తుంది. అలాగే, మీరు ఎక్కువసేపు ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే, ఒక బాటిల్ వాటర్ తీసుకెళ్లడం, నిరంతరం హైడ్రేటెడ్ గా ఉండటం చాలా అవసరం. ఈ జాగ్రత్తలన్నీ తీసుకోవడం ద్వారా వేడిలో వేగవంతమైన ఉష్ణోగ్రత మార్పుల ప్రమాదాలను నివారించవచ్చు. ఎక్కువసేపు ఏసీలో ఉండి నేరుగా ఎండలోకి వెళ్లే అలవాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. ముఖ్యంగా వేసవి మధ్యాహ్న సమయాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్య దృక్కోణం నుండి, చాలా సులభమైన దశలతో పెద్ద ప్రమాదాలను నివారించవచ్చు.



## అబ్బాయిలు మొదటిసారి కలిసినప్పుడు అమ్మాయిల్లో ఏం గమనిస్తారో తెలుసా..?

నేటికాలంలో అమ్మాయిలు, అబ్బాయిలు డేటింగ్‌కి వెళ్లడం షరా మామూలే. అయితే అబ్బాయిలు మొదటి సారిగా అమ్మాయిలను కలిసినప్పుడు వారుకొన్ని విషయాలను నిశితంగా పరిశీలిస్తారట. వీటిలో మొదటిది నవ్వు. చిరునవ్వు స్నేహానికి సంకేతం. కాబట్టి అబ్బాయిలు ముందుగా అమ్మాయిల చిరునవ్వును గమనిస్తారు. స్వచ్ఛమైన చిరునవ్వు ఇద్దరు వ్యక్తుల మధ్య మంచి అనుబంధాన్ని ఏర్పరుస్తుంది. అబ్బాయిలు మొదటిసారిగా అమ్మాయిని కలిసినప్పుడు వారు మొదట ఆమె కళ్ళను చూస్తారు. ఎందుకంటే అబ్బాయిలు తరచుగా అమ్మాయిల కళ్ళకు ఆకర్షితులవుతారు. ఇక రెండోది వాయిస్. అమ్మాయిల గొంతు అబ్బాయిలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. కాబట్టి చాలా మంది అబ్బాయిలు తమ మొదటి మీటింగ్‌లో అమ్మాయి గొంతు ఎలా వినిపిస్తుందో శ్రద్ధ గమనిస్తారు. న్యూజిలాండ్‌లో నిర్వహించిన ఒక సర్వేలో అబ్బాయిలు మొదట అమ్మాయిల గొంతు విన్న తర్వాత వారి పట్ల ఎక్కువగా ఆకర్షితులవుతారని తేలింది. మూడోది డ్రెస్సింగ్ సెన్స్. అబ్బాయిలు కూడా అమ్మాయిల ఫ్యాషన్ సెన్స్, డ్రెస్ సెన్స్‌ని చూస్తారు. అబ్బాయిలకు అమ్మాయిల ఫ్యాషన్ గురించి పెద్దగా తెలియకపోయినా ఆమె బట్టలు ఎలా నప్పాయో, ఆమె నెయిల్ పాలిష్ వేసుకుందా లేదా, ఆమె ధరించిన చెప్పులు ఎలా ఉన్నాయి వంటి విషయాలు చాలా శ్రద్ధగా గమనిస్తారు. నాలుగోది మేకప్. అమ్మాయిలు డేటింగ్ కి వెళ్ళినప్పుడు అందంటా కనిపించేందుకు మేకప్ వేసుకుంటారు ఎందుకంటే మేకప్ వేసుకుంటే తాము బాగా కనిపిస్తామని అనుకుంటారు. కానీ అబ్బాయిలకు ఇది నచ్చదు. వారు ఎక్కువగా సహజ సౌందర్యాన్ని ఇష్టపడతారు. కాబట్టి అబ్బాయిలు అమ్మాయి మేకప్ వేసుకుంటుందా? లేదా? అనే దానిపై కూడా చాలా శ్రద్ధ చూపిస్తారన్నమాట. ఐదోది ప్రవర్తన. ఒక అమ్మాయి మొదటిసారి కలిసినప్పుడు ఆమె ఎలా ప్రవర్తిస్తుందో అబ్బాయిలు గమనిస్తారు. ఆమె ఇతరులతో ఎలా మాట్లాడుతుందో, ఎలా ప్రవర్తిస్తుందో కూడా వారు గమనిస్తారు. అంతేకాకుండా వారు అమ్మాయిల జుట్టు, ఆమె ఆత్మవిశ్వాసం, ఆమె బడీ లాంగ్వేజ్‌పై ఎక్కువ శ్రద్ధ చూపుతారు.

## ఈ జ్యూస్ తాగితే ఎన్ని లాభాలో తెలుసా..?



మనకు దొరికే మంచి కూరగాయల్లో బీట్రూట్‌కి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో చాలా విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వీటివల్ల మన ఒంటికి కావలసిన పోషకాలు అందుతాయి. అంతేకాదు చాలా రకాల ఆరోగ్య సమస్యలు మన దరి చేరకుండా ఉంటాయి. ముఖ్యంగా బీట్రూట్‌ను జ్యూస్ లాగా తాగితే అది మన ఒంటికి చాలా తొందరగా శక్తిని ఇస్తుంది. బీట్రూట్ లో ఐరన్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మన ఒంట్లో హిమోగ్లోబిన్ లెవెల్ ను పెంచుతుంది. దానివల్ల రక్తంలో ఎర్ర రక్త కణాలు బాగా తయారవుతాయి. తరచూ బీట్రూట్ జ్యూస్ తాగితే రక్తం తక్కువగా ఉండటం వల్ల వచ్చే నీరసం, బద్ధకంగా ఉండటం లాంటి సమస్యలు తగ్గుతాయి. రక్తం బాగా తిరుగుతుంది కాబట్టి మన శరీరం చాలా శక్తివంతంగా ఉంటుంది. బీట్రూట్ జ్యూస్‌లో ఫైబర్ ఉంటుంది. ఇది మనం తిన్నది బాగా అరగడానికి సహాయపడుతుంది. ఈ జ్యూస్ కడుపులో వచ్చే గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. రోజూ ఒక గ్లాస్ బీట్రూట్ జ్యూస్ తాగితే పేగులు శుభ్రంగా ఉంటాయి. అంతేకాదు చెత్త పదార్థాలు కూడా తొందరగా బయటికి పోతాయి. బీట్రూట్‌లో నాచురల్‌గా ఉండే నైట్రేట్‌లు మన ఒంట్లో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను పెద్దవి చేస్తాయి. దానివల్ల రక్తం బాగా తిరుగుతుంది. ఇది హై బీపీని కంట్రోల్ చేయడంలో సహాయపడుతుంది. బీపీ ఎక్కువగా ఉన్నవాళ్లు ఈ జ్యూస్ తాగితే మంచి ఫలితాలు ఉంటాయి. బీట్రూట్ జ్యూస్ గుండెకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే అవకాశాన్ని తగ్గిస్తుంది. గుండెకు కావలసిన ఆక్సిజన్ బాగా అందుతుంది. దానివల్ల గుండెపోటు, స్ట్రోక్ లాంటి ప్రమాదాలు దూరంగా ఉంటాయి. బీట్రూట్లో ఉండే పోషకాలు మన జీవక్రియను వేగవంతం చేస్తాయి. మన ఒంట్లోని కొవ్వు తొందరగా ఖర్చవుతుంది. ఎక్కువ శక్తి వస్తుంది కాబట్టి రోజూ చేసే పనుల్లో నీరసం రాదు. ఎక్సర్‌సైజ్ చేయాలనుకునే వాళ్లకు ఇది చాలా సహాయపడుతుంది. బీట్రూట్ జ్యూస్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ మన ఒంటికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దీని తీపి రుచి వల్ల ఆకలి కూడా తగ్గుతుంది. ఇందులో ఉండే ఫైబర్ వల్ల కడుపు నిండినట్టు ఉంటుంది. దానివల్ల ఎక్కువగా తినడం తగ్గుతుంది. ఈ జ్యూస్ తాగుతూ ఎక్సర్ సైజ్ చేస్తే బరువు తగ్గడం సాధ్యమే. బీట్రూట్ జ్యూస్ నాచురల్‌గా శక్తిని ఇచ్చే చాలా మంచి డ్రిరక్. ఇది మన ఒంట్లోని రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. తరచూ దీన్ని తాగితే చర్మం మెరుస్తుంది. ముఖానికి సహజమైన కాంతి వస్తుంది. ఇలా బీట్రూట్ జ్యూస్ ను ప్రతి రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

## బెండకాయ నీటిలో పసుపు కలిపితే అద్భుతమైన హెల్తీ డ్రింక్..




ఆరోగ్యం కోసం ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన డ్రిరక్ గురించి తెలుసా? మీ వంటింట్లో నిత్యం కనిపించే బెండకాయ, ఎన్నో ఔషధ గుణాలు కలిగిన పసుపు.. ఈ రెండూ కలిసి ఒక శక్తివంతమైన హెల్తీ డ్రిరక్ తయారుచేస్తాయి. రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు, మీ చర్మానికి కాంతినిచ్చే ఈ సహజసిద్ధమైన చిట్కా గురించి తెలుసుకుంటే మీరు తప్పకుండా ఆశ్చర్యపోతారు. ఇంకెందుకు ఆలస్యం? సహజ సిద్ధమైన ఆహార పదార్థాలకు మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శక్తి ఉంటుంది. అలాంటి వాటిలో బెండకాయ పసుపు ప్రముఖమైనవి. ఈ రెండిరటినీ కలిపి తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలోనూ, కొరియన్ల తరహా మెరిసే చర్మాన్ని పొందడంలోనూ ఇది అద్భుతంగా పనిచేస్తుందంటున్నారు.

1. రక్తంలో చక్కెర నియంత్రణ: బెండకాయలో ఉండే ప్రత్యేకమైన ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడానికి సహాయపడుతుంది. పసుపులో ఉండే కర్కుమిన్ కూడా ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. ఈ కలయిక డయాబెటిస్ ఉన్న వారికి ఎంతో మేలు చేస్తుంది. 2. మెరిసే చర్మం కోసం: పసుపు ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది చర్మంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. బెండకాయ నీరు చర్మాన్ని తేమగా ఉంచడానికి సహాయపడుతుంది. ఈ రెండూ కలిసి చర్మానికి సహజమైన మెరుపును అందిస్తాయి. కొరియన్ల తరహా ''గ్లాస్ స్కిన్'' కోసం ఇది ఒక సహజమైన చిట్కాగా పరిగణించబడుతోంది.

3. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: బెండకాయలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సాఫీగా జరిగేలా చేస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. పసుపు జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. 4. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పసుపులో ఉండే కర్కుమిన్ శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరం యొక్క రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది మరియు ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. 5. బరువు తగ్గడానికి సహాయపడుతుంది: బెండకాయ నీరు తక్కువ కేలరీలు కలిగి ఉండటమే కాకుండా, కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. పసుపు శరీరంలోని కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మంచి పానీయం. **తయారీ విధానం:** బెండకాయలను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఒక గ్లాసు నీటిలో ఈ ముక్కలను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం ఆ నీటిని వడగట్టి, చిటికెడు పసుపు కలిపి ఖాళీ కడుపుతో తాగాలి. ఈ సహజమైన పానీయం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి, మీ దినచర్యలో దీన్ని భాగం చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపొచ్చు.

## కళ్లను కాటేస్తున్న క్యాన్సర్ మహమ్మారి..

శరీరంలోని ఇతర భాగాలకు వచ్చినట్లే కళ్ళలో కూడా క్యాన్సర్ వస్తుందట. కంటి క్యాన్సర్‌ను సాధారణంగా కంటి మెలనోమా అని పిలుస్తారు. కంటి క్యాన్సర్ కంటిలోని ఏదైనా భాగంలో అభివృద్ధి చెందవచ్చు. ఇతర క్యాన్సర్ల మాదిరిగానే ఇది కూడా గుర్తించదగిన కొన్ని లక్షణాలను కలిగి ఉంటుంది. కళ్లకు కూడా క్యాన్సర్ వస్తుందని మీకు తెలుసా? అవును.. మీరు సరిగ్గానే విన్నారు. శరీరంలోని ఇతర భాగాలకు వచ్చినట్లే కళ్ళలో కూడా క్యాన్సర్ వస్తుందట. కంటి క్యాన్సర్‌ను సాధారణంగా కంటి మెలనోమా అని పిలుస్తారు. కంటి క్యాన్సర్ కంటిలోని ఏదైనా భాగంలో అభివృద్ధి చెందవచ్చు. ఇతర క్యాన్సర్ల మాదిరిగానే ఇది కూడా గుర్తించదగిన కొన్ని లక్షణాలను కలిగి ఉంటుంది. కానీ దానిని ముందుగానే గుర్తించాలి. మరి కళ్ళలో క్యాన్సర్ రావడానికి కారణాలు ఏమిటి? కంటి క్యాన్సర్ లక్షణాలు ఏమిటి ? కంటి క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించగలదా? చికిత్స ఎలా ఉంటుంది? కంటి క్యాన్సర్‌ను అరుదైన క్యాన్సర్‌గా చెప్పవచ్చు. కళ్లకు కూడా అనేక రకాల క్యాన్సర్లు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఒకటి కళ్ళలో కణితుల పెరుగుదల. ఈ కణితులు కళ్ళలోని కొన్ని భాగాలలో పెరుగుతాయి. కంటిలో అభివృద్ధి చెందే అన్ని కణితులు క్యాన్సర్ కానప్పటికీ.. వాటిని తనిఖీ చేసుకోవడం



చాలా ముఖ్యం. అంతేకాకుండా కంటి క్యాన్సర్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే అది శరీరం అంతటా వ్యాపిస్తుంది. కాబట్టి కళ్ళలో క్యాన్సర్ లక్షణాలను విస్మరించకూడదు. ప్రారంభ చికిత్స ద్వారా ఈ క్యాన్సర్ పెరగకుండా నిరోధించవచ్చు. కంటి క్యాన్సర్‌లో అనేక రకాలు ఉన్నాయి. వాటిలో కంటి లేదా ఐరిస్ రంగు భాగంలో అభివృద్ధి చెందుతున్న ఐరిస్ మెలనోమా, కంటి లెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న సిలియరీ బాడీ మెలనోమా, కంటి లైనింగ్‌లో ఏర్పడే కొరోయిడల్ మెలనోమా వంటివి ముఖ్యమైనవి. ఈ క్యాన్సర్ కొన్ని ప్రారంభ లక్షణాలు గుర్తించడానికి ముందే ఒంట్లో తిష్టవేస్తాయి. వీటిలో అస్పష్టమైన దృష్టి, కంటిపై మచ్చలు, కంటి చికాకు వంటి లక్షణాలు ముఖ్యమైనవి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకోవాలి. ఎలా నివారించాలి? కళ్ళ శుభ్రత, భద్రతను ఎల్లప్పుడూ కాపాడుకోవాలి. ప్రత్యక్ష సూర్యకాంతి నుంచి కళ్ళను రక్షించుకోవాలి. దుమ్ము, వాయు కాలుష్యానికి ఎక్కువసేపు గురికాకుండా కళ్లను కాపాడుకోవాలి.



# ఒక్కరు కాదు ముగ్గురు !

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కలయికలో సన్ పిక్చర్స్ నిర్మించబోయే ప్యాన్ ఇండియా మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. ఈ వేసవిలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేలా ప్లానింగ్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం బన్నీ గెటప్ కు సంబంధించిన విఎఎక్స్ ఎలా ఉండాలనే దాని మీద విదేశీ నిపుణుల బృందంతో కలిసి వర్క్ షాప్ చేస్తున్న అట్లీ టీమ్ వాటి గురించిన మైండ్ బ్లోయింగ్ డీటెయిల్స్ బయటికి రాకుండా జాగ్రత్త పడుతోంది. అయితే కొన్ని లీక్స్ వచ్చేస్తున్నాయి. వాటిలో ప్రధానమైంది అల్లు అర్జున్ ఇందులో ట్రిపుల్ రోల్ చేయబోతున్నాడనేది టాక్. ఇంకో ట్విస్ట్ ఏంటంటే ఒక పాత్ర పూర్తి యానిమేషన్ లో ఉంటుందట. మిగిలిన రెండిరట్లో ఒకటి హీరో కాగా మరొకటి విలన్. ఇప్పటిదాకా ఇలాంటి ప్రయోగం ఏ ఇండియన్ హీరో చేయలేదు. చిన్న సీన్లు లేదా ఎపిసోడ్లలో కనిపించడం మాములే కానీ ఫుల్ లెన్త్ సినిమాలో చేసిన దాఖలాలు లేవు. ఒక దానితో మరొకటి సంబంధం లేకుండా ట్రీట్ మెంట్ డిఫరెంట్ గా ఉంటుందని, అవెంజర్స్, డ్యూన్ తరహాలో ఒక డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుందని అంటున్నారు. హాలీవుడ్ స్టాండర్డ్ కు ఏ మాత్రం తగ్గకుండా ఉండేలా అట్లీ రాసుకున్నారని సమాచారం. తెరకెక్కించడం కూడా అదే స్థాయిలో ఉండబోతోందట. అల్లు అర్జున్ కెరీర్ లోనే తొలి సైన్స్ ఫిక్షన్ మూవీగా బడ్జెట్ పరంగా ఎలాంటి రాజీ ఉండబోవడం లేదని చెన్నై టాక్.

# రాజాసాబ్ ఇప్పట్లో వస్తాడా..



ప్రభాస్ ఫ్యాన్స్ విపరీతమైన అంచనాలతో ఎదురు చూస్తూ వచ్చిన ది రాజా సాబ్ హఠాత్తుగా అప్డేట్లు ఆపేయడంతో కొన్ని నెలలు అయోమయం నెలకొన్న మాట వాస్తవం. ఒకపక్క ఫౌజీ షూట్ వేగంగా జరగడం లేనిపోని అనుమానాలను తీసుకొచ్చింది. తాజా సమాచారం మేరకు ది రాజా సాబ్ చిత్రీకరణ ఇంకో 30 రోజులు చేస్తే అయిపోతుందట. ఆ మేరకు దర్శకుడు మారుతీ ప్లానింగ్ సిద్ధం చేసి ఎక్కడ టాకీ పార్ట్ తీయాలి, పాటలకు ఏ లొకేషన్లు కావాలి వగైరా హోమ్ వర్క్ మొత్తం చేసి డార్లింగ్ డేట్స్ కోసం ఎదురు చూస్తున్నట్టు తెలిసింది. అన్నీ కుదిరితే ఈ నెలాఖరులో టీజర్ లాంచ్ చేయాలని చూస్తున్నారు. విదేశాల నుంచి ప్రభాస్ తిరిగి వచ్చేశాడు కాబట్టి ప్రధాన టెన్షన్ తీరినట్టే. ముందు రాజా సాబ్ టీజర్ డబ్బింగ్ చెప్పాక డేట్ల వ్యవహారం చూడబోతున్నాడు. ప్రస్తుతం తను అవసరం లేని సీన్లను తీస్తున్నారు. సంజయ్ దత్ తో పాటు ఇతర క్యాస్టింగ్ ఇందులో పాల్గొంటోందట. అంతా బాగానే ఉంది కానీ ప్రభాస్ ఏకబికిన ముప్పై రోజుల కాల్ షీట్స్ ఇవ్వడం అంత సులభంగా కనిపించడం లేదు. ఎందుకంటే ఫౌజీ కూడా సమాంతరంగా జరుగుతోంది. రెండిరటికి అడ్జస్ట్ చేయగలిగితే ఇబ్బంది లేదు. కాకపోతే లుక్స్ పరంగా రెండూ ఒకటే కాదు కాబట్టి ఈ ఒక్క విషయంలో ఎలాంటి జాగ్రత్త తీసుకుంటారో చూడాలి. విడుదల తేదీ విషయంలో ది రాజా సాబ్ ఎలాంటి ఆప్షన్లు పెట్టుకోలేదని తెలిసింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీనే నిర్మించిన మిరాయ్ ఆగస్ట్ 1 విడుదల కాబోతున్న నేపథ్యంలో ప్రభాస్ మూవీని వీలైతే డిసెంబర్ లో థియేటర్లకు తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధమవుతోందని అంటున్నారు.



# యమదొంగ లెక్క ఎందుకు తప్పింది

రీ రిలీజుల ట్రెండ్ ఎప్పటికప్పుడు అయిపోయింది అనుకున్నప్పుడంతా ఏదో ఒక సినిమా భారీ వసూళ్లు రాబట్టడం, మళ్ళీ ఇంకొన్ని క్యూ కట్టడం పరిపాటిగా మారిపోయింది. దీంతో ఈ ధోరణిని ఎలా అనాలసిస్ చేసుకోవాలో అర్థం కాక బయ్యర్లు తలలు పట్టుకుంటున్నారు. నిన్నటి నుంచి థియేటర్లలో అడుగు పెట్టిన యమదొంగకు ఆశించిన స్థాయిలో భారీ స్పందన లేకపోవడం చూసి ఎగ్జిబిటర్లు ఆశ్చర్యపోతున్నారు. పలు చోట్ల హౌస్ ఫుల్స్ కనిపించినప్పటికీ అన్ని సెంటర్లలో ఒకే తరహా స్పందన లేదు. మే 20 జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు కాకుండా రెండు రోజుల ముందే విడుదల చేయడం కలిసి రాలేదు. ఆర్ఆర్ఆర్ లాంటి ఇంటర్నేషనల్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన రాజమౌళి దర్శకుడు. దేవర లాంటి రికార్డులు బద్దలు కొట్టిన జూనియర్ ఎన్టీఆర్ చేసిన మూవీ, వీటికి తోడు కీరవాణి సూపర్ హిట్ పాటలు. ఇవి చాలు అభిమానులు సెలెబ్రేట్ చేసుకోవడానికి. కానీ యమదొంగకు రెస్పాన్స్ తగ్గిన విషయంలో పలు కారణాలు కనిపిస్తున్నాయి. జక్కన్న ఫిల్మోగ్రఫీలో యమదొంగ టాప్ 5 లో లేదు. బాహుబలి, మగధీర, విక్రమార్కుడు, ఛత్రపతి, సింహాద్రి తర్వాతే మూవీ లవర్స్ దీనికి చోటిస్తారు. పైగా శాటిలైట్ ఛానల్స్ లో చాలాసార్లు ప్రసారం కాగా యూట్యూబ్ లో 4స క్లారిటీతో ఉచితంగా అందుబాటులో ఉంది. గమనించాల్సిన పాయింట్ మరొకటి ఉంది. ఇటీవలే జగదేకవీరుడు అతిలోకసుందరిని వింటేజ్ సినీ ప్రియులు థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేశారు. దాని స్థాయికి తగ్గ కలెక్షన్లు వచ్చాయి.



# జూన్‌లో ‘ఫణి’ విడుదల

టాలెంటెడ్ డైరెక్టర్ డాక్టర్ వీఎన్ ఆదిత్య రూపొందిస్తున్న గ్లోబల్ మూవీ “ఫణి”. ఈ థ్రిల్లర్ సినిమాను ఓ. ఎం. జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు డ ఐ స్టూడియో సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి ఇంగ్లీషు, తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక నల్ల పాము(బ్లాక్ పైన్) ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ విజువల్ వండర్ మూవీలో కేథరిన్ ట్రెసా, మహేష్ శ్రీరామ్, నేహాకృష్ణ, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాధ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ రోజు నిర్మాత, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షి అనిపిండి పుట్టినరోజు సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన మూవీ టీమ్ సినిమా రిలీజ్ అప్డేట్ ఇచ్చారు. జూన్ నెలాఖరులో “ఫణి” చిత్రాన్ని గ్లోబల్ మూవీగా రిలీజ్ చేయబోతున్నట్లు వెల్లడిరచారు. సంగీత దర్శకురాలైన డాక్టర్ మీనాక్షి అనిపిండి అమెరికాలో మీనాక్షి సుస్వర అకాడెమీ ద్వారా లైట్ మ్యూజిక్, కర్ణాటిక్ మ్యూజిక్, లలిత సంగీతం నేర్పిస్తూ నేటి తరానికి మన సంగీత వారసత్వాన్ని అందిస్తున్నారు. మరోవైపు “ఫణి” చిత్రంతో ఒక విభిన్న ప్రయత్నం చేస్తూ నిర్మాతగా తన అభిరుచి చాటుకుంటున్నారు డాక్టర్ మీనాక్షి అనిపిండి. ఈ చిత్రానికి ఆమె నిర్మాణ బాధ్యతలతో పాటు సంగీతాన్ని అందించారు. డాక్టర్ మీనాక్షి అనిపిండి “ఫణి” చిత్రానికి అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణ కాబోతోంది. ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్సిపీరియన్స్ ఇచ్చేందుకు “ఫణి” మూవీ సిద్ధమవుతోంది.

# ఆయ్ హీరో మొదటి సినిమా



జూనియర్ ఎన్టీఆర్ బావమరిదిగా ఇండస్ట్రీకి వచ్చినా బ్యాక్ టు బ్యాక్ మూడు హిట్లతో బాగానే దూసుకుపోతున్న హీరో నితిన్ నార్నె ఇటీవలే శ్రీవిష్ణు సింగిల్ లో చిన్న క్యామియో చేశాడు. అయితే ఇప్పటిదాకా నితిన్ నార్నె డెబ్యూ మూవీ రిలీజ్ కాలేదంటే వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా అదే నిజం. శ్రీశ్రీశ్రీ రాజావారు పేరుతో రూపొందిన లవ్ కం యాక్షన్ ఎంటర్ టైనర్ జూన్ రెండో వారంలో విడుదల చేసేందుకు ప్లానింగ్ జరుగుతోందట. దీని ట్రైలర్ చాలా కాలం క్రితమే వచ్చింది. కొంచెం అటుఇటుగా రెండేళ్ల ముందే షూటింగ్ అయిపోయింది. కానీ రకరకాల కారణాల వాయిదా పడుతూ చివరికి మోక్షం దక్కించుకోనుందట. అలాని ఇదేదో అనుభవం లేని డెబ్యూ డైరెక్టర్ తీసిన సినిమా కాదు. శతమానం భవతి లాంటి నేషనల్ అవార్డు ఫ్యామిలీ మూవీ ఇచ్చిన సతీష్ వేగ్నేశ దర్శకుడు. ఇంత బ్రాండిరగ్ ఉండి కూడా శ్రీశ్రీశ్రీ రాజావారు లేట్ కావడం ఆశ్చర్యమే. మ్యాడ్, ఆయ్, మ్యాడ్ స్క్వేర్ మూడు విజయవంతమయ్యాక నితిన్ నార్నెకు బాగానే మార్కెట్ పెరిగింది. వాటి సక్సెస్ లో తనది సోలో క్రెడిట్ కాకపోయినా ప్రామిసింగ్ హీరోగా మారిపోయాడు. కాకపోతే డెబ్యూ మూవీ ఇంత ఆలస్యం రావడం బిజినెస్ పరంగా నిర్మాతకు ఉపయోగపడుతుందేమో కానీ హీరోగా నితిన్ నార్నెకు దక్కే అడ్వాంటేజ్ తక్కువేనని చెప్పాలి టాక్ ఎక్స్ ట్రాడినరిగా వస్తే తప్ప. గతంలో విజయ్ దేవరకొండ, నిఖిల్ లాంటి యూత్ హీరోలు సైతం ఈ సమస్యను ఎదురుకున్నారు. ఒక బ్లాక్ బస్టర్ రాగానే ల్యాబ్ లో రిలీజ్ ఆగిపోయిన సినిమాలు తీసుకొచ్చి రిలీజ్ చేయడం జరిగింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
















# వరంగల్ రైల్వే స్టేషన్‌కు నయా లుక్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దాదాపు 40 వరకు స్టేషన్లను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రంలోని కీలకమైన స్టేషన్లలో ఒకటైన వరంగల్ రైల్వే స్టేషన్‌ను సైతం రైల్వేశాఖ రూ.25.41 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేస్తోంది. స్టేషన్ రెనొవేషన్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్టేషన్ కొత్త రూపురేఖల ఫోటోలను ట్విట్టర్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు.

ఫిబ్రవరి 2024లో వరంగల్ స్టేషన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా.. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ప్రయాణికుల కోసం మెరుగైన రవాణా సౌకర్యాలు, ఆధునిక స్టేషన్ భవనం, విశాలమైన వెయిటింగ్ రూమ్‌లు, పరిశుభ్రమైన టాయిలెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత వైఫై సదుపాయంతో పాటు స్టేషన్‌ను నగరంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసే పనులు కూడా చురుగ్గా జరుగుతన్నాయి. మొత్తంగా ఎయిర్‌పోర్టు తరహాలో స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

బీజేపీ తెలంగాణ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అశ్వినీ వైష్ణవ్ ట్వీట్‌ను రీట్వీట్ చేసారు. అమృత్ భారత్ పథకం కింద తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల కల్పనకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం కూడా వేగంగా జరుగుతోంది. ఇటీవల మనోహరాబాద్‌మహబూబ్‌నగర్, మెదక్‌సికింద్రాబాద్ వంటి కొత్త లైన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. దీంతో పాటు కాజీపేట రైల్వే స్టేషన్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఇతర ముఖ్యమైన రైల్వే స్టేషన్లు అయిన నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి వాటిని కూడా అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 117 రైల్వే స్టేషన్లను అభివృద్ధి పరుస్తుండగా.. ఒక్క తెలంగాణలోనే 40 స్టేషన్లు కొత్తగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా తెలంగాణలోని రైల్వే ప్రయాణికులకు విమానాశ్రయ తరహా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

# మద్యం ముట్టుకోని ఇంగ్లాండ్ వరల్డ్ కప్ విన్నర్!

ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన హామ్‌స్ట్రింగ్ గాయం నుంచి కోలుకోవడానికి మద్యం మానేశాడు. గాయం కారణంగా ఆటకు దూరమైన స్టోక్స్, జనవరి 2 నుంచి ఒక్క పానీయం కూడా తాగలేదని తెలిపాడు. తన జీవనశైలిలో మార్పులు తీసుకురావడమే కాదు, 'క్లీన్‌కో' అనే జీరో ఆల్కహాల్ బ్రాండ్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించాడు. జింబాబ్వేతో జరగబోయే మ్యాచ్‌లో స్టోక్స్ మళ్లీ జట్టులోకి వస్తూ యువ క్రికెటర్లకు ప్రేరణగా నిలుస్తున్నాడు.

ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన హామ్‌స్ట్రింగ్ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి తీసుకున్న నిర్ణయాలు, జీవితంలో చేసిన మార్పులు ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్నాయి. ఇటీవలే మద్యం సేవించడం మానేసిన స్టోక్స్, తన గాయాన్ని త్వరగా నయం చేసుకోవాలన్న లక్ష్యంతో ఈ మార్పు చేశాడు. అతని మాటల్లో చెప్పాలంటే "ఈ సంవత్సరం ప్రారంభంలో తాగుడు మానేశాను. తాగకుండా ఉండటం వల్ల నా గాయం త్వరగా నయం అవుతుందని ఆశిస్తున్నాను." న్యూజిలాండ్‌తో జరిగిన మూడవ టెస్ట్ సమయంలో 33 ఏళ్ల స్టోక్స్ తన ఎడమ హామ్‌స్ట్రింగ్‌కు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ గాయం కారణంగా అతను చాలా కాలంగా ఆటకు దూరంగా ఉన్నాడు. స్టోక్స్ 'అన్‌టాప్డ్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, "నా మొదటి పెద్ద గాయం తర్వాత చాలా షాక్ అయ్యాను. ఆ గాయం ఎలా జరిగిందా అని ఆలోచించాను. మేము నాలుగు లేదా ఐదు రాత్రుల క్రితం కొంచెం మద్యం సేవించాము, అది కూడా కారణమా అని నా మనస్సులో సందేహం వచ్చింది. అప్పుడే నేను నా జీవనశైలిలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించుకున్నాను" అని చెప్పాడు. గత సంవత్సరం 'ది హండ్రెడ్'




టోర్నమెంట్‌లో స్టోక్స్ తొడ కండరాలకు గాయం అయ్యింది. తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మళ్ళీ గాయపడ్డాడు. "నేను ఎప్పటికీ పూర్తిగా మద్యం తాగలేనని అనుకుంటున్నాను. కానీ జనవరి 2 నుంచి ఒక్క పానీయం కూడా తాగలేదు. నేను నాలో నాకే ఇలా అనిపించింది. 'నా గాయం పూర్తిగా నయం అయ్యే వరకు, తిరిగి మైదానంలో అడుగుపెట్టే వరకు మద్యం తాగకూడదు'," అని స్టోక్స్ వివరించాడు. ఈ ఆత్మ నియంత్రణకు నిదర్శనంగా, ఇటీవలే అతను 'క్లీన్‌కో' అనే జీరో ఆల్కహాల్ స్పిరిట్స్ కంపెనీతో భాగస్వామ్యం ప్రకటించాడు. ఈ సంస్థలో అతను "పెట్టుబడిదారు, బ్రాండ్ భాగస్వామి"గా బాధ్యతలు స్వీకరించాడు. స్టోక్స్ తీసుకున్న ఈ నిర్ణయం కేవలం ఆటను మెరుగుపరచడమే కాదు, ఆయన వ్యక్తిత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. గురువారం ట్రెంట్ బ్రిడ్జ్‌లో జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో స్టోక్స్ మళ్లీ జట్టులోకి అడుగుపెట్టనున్నాడు. గాయం తర్వాత బలంగా తిరిగి రావడానికి అతను తీసుకున్న ఈ చర్యలు యువ క్రికెటర్లకు ప్రేరణగా నిలుస్తున్నాయి. మద్యం వదిలేసి దృఢమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్న స్టోక్స్, తన ఆటతోనే కాదు, జీవిత విధానంతోనూ అందరికీ ఆదర్శంగా మారాడు.


# ఎస్‌ఆర్‌హెచ్ చేతిలో లక్నో చిత్తు..

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ కథ ముగిసింది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఏక్నా స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో లక్నో ఓటమి పాలైంది. దీంతో ఈ ఏడాది సీజన్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి పంత్ టీమ్ నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది.

లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్(39 బంతుల్లో 6 ఫోర్లు 4 సిక్స్‌లతో 65), మార్క్రమ్(38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించగా.. నికోలస్ పూరన్(26 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 45) మెరుపులు మెరిపించాడు. ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లలో ఇషాన్ మలింగ రెండు వికెట్లు పడగొట్టగా.. దూబే, హర్షల్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి తలా వికెట్ సాధించారు.

**అభిషేక్ శర్మ విధ్వంసం..**

అనంతరం 206 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 18.2 ఓవర్లలో చేధించింది. ఎస్‌ఆర్‌హెచ్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ(20 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 59) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. క్లాసెన్(47), ఇషాన్ కిషన్(35), మెండిస్(32) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. లక్నో బౌలర్లలో దిగ్వేష్ సింగ్ రెండు, విలియం ఓ రూర్క్ వికెట్ సాధించారు.








# ఇంకా నిర్ణయం తీసుకోలేదు: బీసీసీఐ

భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తల కారణంగా ఆసియా క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండాలని బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌కు చెందిన మంత్రి మొహిసిన్ నఖ్వీ ఏసీసీ చైర్మెన్‌గా ఉండడంతో భారత క్రికెట్ బోర్డు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

తాజాగా ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ జట్ల ఆసియా కప్ నుండి వైదొలుగుతున్నట్లు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు.



"ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ జట్ల ఆసియా కప్ రెండు ఏసీసీ ఈవెంట్‌లలోనూ పాల్గొనకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకుందన్న వార్తలు మా దృష్టికి వచ్చాయి. ఈ రోజు ఉదయం నుంచి ఇదే ప్రచారం జరుగుతోంది. ఇవన్నీ నిరాధరమైన వార్తలు. బీసీసీఐ ఇప్పటివరకు తదుపరి ఏసీసీ ఈవెంట్‌లకు సంబంధించి ఎలాంటి చర్చలు జరపలేదు. అదేవిధంగా ఏసీసీకి ఎటువంటి లేఖ కూడా బీసీసీఐ రాయలేదు.

ప్రస్తుతం మా దృష్టింతా ఐపీఎల్, తదుపరి ఇంగ్లండ్ సిరీస్‌లపైనే మాత్రమే ఉంది. ఆసియా కప్ లేదా ఏదైనా ఇతర ఏసీసీ ఈవెంట్‌పైన ఎటువంటి నిర్ణయం తీసుకున్న భారత క్రికెట్ బోర్డు ప్రెస్‌నోట్ కచ్చితంగా విడుదల చేస్తోంది" అని దేవజిత్ సైకియా టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

కాగా మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ వచ్చే నెలలో జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్‌లో పురుషుల ఆసియా కప్ టోర్నీని నిర్వహించనున్నారు. గత ఆసియా కప్ టోర్నీ శ్రీలంక, పాక్‌ల వేదికగా హైబ్రిడ్ మోడల్‌లో జరిగింది.

# మలేసియా మాస్టర్స్ టోర్నీలో సింధు, ప్రణయ్‌కు మరో అవకాశం

ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, ప్రణయ్‌లకు మరో అవకాశం. గురువారం ఆరంభయ్యే మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు, ప్రణయ్ బరిలో దిగుతున్నారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, 16వ ర్యాంకర్ సింధు మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో 20వ ర్యాంకర్ నట్సుకి నిదైరా (జపాన్)తో తలపడనుంది. మాళ్విక బాన్సోద్, ఆకర్షి కశ్యప్ కూడా పోటీలో ఉన్నారు. చి పిన్ (చైనీస్ తైపీ)ను మాళ్విక.. కుసుమ (ఇండోనేషియా)ను ఆకర్షి ఢీకొంటారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అయిదో సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)ను ప్రణయ్ ఎదుర్కొంటాడు. ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)తో సతీష్ కరుణాకరన్.. బ్రియాన్ యంగ్ (సింగపూర్)తో అయూష్ శెట్టి ఆడతారు. జియా హెంగ్ (సింగపూర్)తో ప్రియాంశు రజావత్ తలపడనున్నాడు. ర్యాంకుల్లో పడిపోయిన కిదాంబి శ్రీకాంత్ మరోసారి క్వాలిఫయర్స్ ద్వారా మెయిన్‌డ్రాకు రావడానికి ప్రయత్నించనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక శివానిరోహన్ కపూర్, ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో, పురుషుల డబుల్స్‌లో హరిహరణ్‌రుబన్ కుమార్ జంటలు పోటీలో ఉన్నాయి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in